ప్రజాశక్తి
సోమవారం 22 జులై 2024 8 పేజీలు
గుంటూరు పల్నాడు





ఇక్కడి సమస్యలు ప్రస్తావనొచ్చేనా?

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. టిడిపి మళ్లీ అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారిగా ఓట్ ఆన్ ఎకౌంట్ బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఈ సమావేశాలు కేవలం ఐదు రోజులు జరుగుతాయని చెబుతున్న నేపథ్యంలో గుంటూరు, పల్నాడు జిల్లాకు చెందిన ఎంతమంది ఎమ్మెల్యేలు తమకున్న అవకాశాలను ఉపయోగించుకుంటో చూడాల్సి ఉంది.

ఇటీవల ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 17 నియోజకవర్గాల నుంచీ టిడిపి ఎమ్మెల్యేలు గెలిచారు. దీంతో జిల్లా నుంచి అసెంబ్లీలో ప్రతిపక్ష పాత్ర లేకుండా పోయింది. కౌన్సిల్ మాత్రం జిల్లా నుంచి వైసిపి సభ్యులు ఎక్కువగా ఉన్నారు. సీనియర్ నాయకులు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ఇప్పటి వరకు మండలిలో చీఫ్‌విప్‌గా ఉన్నారు. లేళ్ల అప్పిరెడ్డి విప్‌గా ఉన్నారు. వీరితోపాటు మురుగుడు హనుమంతరావు, చంద్రగిరి ఏసురత్నం, మర్రి రాజశేఖర్ కూడా జిల్లా నుంచి మండలిలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. టిడిపి నుంచి పంచుమర్తి అనూరాధ, పిడిఎఫ్ నుంచి కె.ఎస్.లక్ష్మణరావు ఉన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ వైసిపి మద్దతుదారుగా ఉన్న కల్పలత కూడా జిల్లా నుంచి మండలిలో సభ్యులుగా ఉన్నారు.

వైసిపి ప్రభుత్వ హయాంలో కూడా ప్రజా సమస్యలపై పెద్దగా చర్చ జరగలేదు. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన అప్పటి ఎమ్మెల్యేలు కేవలం రాజకీయ పరమైన అంశాలకు ప్రాధాన్యమిచ్చారు తప్ప సమస్యల ప్రస్తావన నామమాత్రమే. మండలిలో మాత్రం జిల్లాకు సంబంధించిన అంశాలపై కె.ఎస్.లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రముఖంగా ప్రస్తావించే వారు. ఎమ్మెల్యేల్లో నియోజకవర్గాల సమస్యలను ప్రస్తావించిన శాసనసభ్యుల సంఖ్య చాలా తక్కువేనని చెప్పాలి. ప్రభుత్వ విధానాలు, బడ్జెట్ ప్రతిపాదనలు, పలు అంశాలపై జరిగిన చర్చల్లో పాల్గొనడం తప్ప నియోజకవర్గాల్లోని సమస్యలను ప్రస్తావించి నిధులు రాబట్టుకున్న ఎమ్మెల్యేలు ఒకరిద్దరు కూడా లేరంటే అతిశయోక్తి కాదు.

మండలిలో ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు ప్రధానంగా వరికపూడిసెల, గుంటూరు ఛానల్ విస్తరణ, గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి, గుంటూరు నగరపాలక సంస్థలో అభివృద్ధి పనుల జాప్యం, యూజిడి, ఆర్‌యుబి, ఆర్‌వోబిల అంశాలతో పాటు మెడికల్ కళాశాల, పాఠశాల దుస్థితి, ఉపాధ్యాయులు కొరత, పాఠశాలల విలీనం నిర్ణయాల వల్ల ఏర్పడిన ఇబ్బందులు, డిఎస్‌సి నోటిఫికేషన్లు, మౌలిక వసతులు తదితర అంశాలపై ప్రముఖంగా ప్రస్తావించారు. ఈసారి జిల్లాకు చెందిన అంశాల ప్రస్తావనకు ఏ మేరకు అవకాశం ఉంటుందనేదీ చర్చనీయాంశంగా మారింది.

గుంటూరు నగరంలో యూజిడి పనులు నిలిచిపోయి నాలుగు ఏళ్లు దాటినా ప్రభుత్వం ఈపనులపై దృష్టి సారించలేదు.కాల్వల మరమ్మతులు సకాలంలో జరగక జిల్లాలో గత ఖరీఫ్‌లో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై వర్షాలు కురుస్తున్న సమయంలో టెండర్లు ఖరారు చేయడంపై రైతులు అసంతృప్తిగా ఉన్నారు. సకాలంలో నిధుల కేటాయింపు జరగకపోవడంతో టెండర్లు ఖరారులో జాప్యమైందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న కొద్దిపాటి వర్షాలకు పొలాలు ముంపునకు గురవుతున్నాయి. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పలు పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో ఈ పనులు ఎప్పటికి పూర్తవుతాయన్నదీ ప్రశ్నార్ధకంగా మారింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా ఇప్పట్లో అభివృద్ధి పనులకు నిధులు ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో పెండింగ్‌లో ఉన్న వంతెనలు, బ్రిడ్జిలు, యుజిడి పనుల ఎప్పటికి పూర్తవుతాయన్నదీ ప్రశ్నార్థకంగా మారింది.

నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు



కలలు కల్లలు.. పగిలిన గుండెలు..

అమెరికాలో వేర్వేరు ప్రమాదాల్లో తెనాలికి చెందిన ఇద్దరు విద్యార్థులు మృతి

ప్రజాశక్తి-తెనాలి



'మాది పేద కుటుంబం. పొలం కౌలుకు సాగుచేస్తూ బిడ్డలను చదివించుకున్నాం. నా పెద్ద కొడుకు ఉన్నత చదువుకు అమెరికా వెళతానంటే అడ్డుచెప్పలేదు. ఆర్థిక స్థోమత అంతంతమాత్రమే అయినా బ్యాంకు లోను తీసుకుని అమెరికా పంపించాం. వాడి భవిష్యత్‌పై కలలు కన్నాం. కాని చివరకు గర్భశోకం మిగిల్చాడు. శవాన్నైనా చూసే భాగ్యం కల్పించండయ్యా'......

తాడిబోయిన జయలక్ష్మి


హారిక ఇంటి వద్ద విషాద వాతావరణం

'మాది సాధారణ మధ్య తరగతి కుటుంబం. దేవాశాయ శాఖలో చిన్నపాటి ద్యోగంతోపాటు, భూమిని కౌలుకు సాగుచేస్తూ కుమార్తె, కుమారుడిని ప్రయోజకులను చేశాం. కుమార్తె పిజి కోసం అమెరికా వెళతామంటే కాదనలేక పోయాం. ఉన్న కొద్దిపాటు సొమ్ముకు తోడు బ్యాంకు లోనుతో ఉన్నత విద్యకోసం అమెరికా పంపాం. విగతజీవిగా మారుతుందని ఊహించ లేకపోయాం. మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని వేడుకుంటున్నాం'...

జెట్టి శ్రీనివాసరావు, నాగమణి దంపతులు.

ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన పట్టణంలోని ఐతానగర్‌కు చెందిన యువతి, యువకులు వేర్వేరు ప్రమాదాల్లో మృతి చెందడంతో రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం అలముకుంది. ఐతానగర్‌కు చెందిన జెట్టి శ్రీనివాసరావు, నాగమణి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె జెట్టి హారిక (25) గతేడాది ఆగస్టులో ఫుడ్ అండ్ న్యూట్రిషన్‌లో ఎంఎస్ చేసేందుకు అమెరికా వెళ్లారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున ఆమె ప్రయాణిస్తున్న కారును మరో వాహనం ఢీకొనటంతో మృతి చెందారు. ఊహించని పరిణామంతో కుటుంబీకులు విలవిల్లాడుతున్నారు. ఆమె మృతదేహాన్ని రప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని వేడుకుంటున్నారు.

ఐతానగర్‌కు చెందిన తాడిబోయిన శ్రీనివాసరావు, నాగమణి దంపతులకు ఇరువురు కుమారులు. పెద్దకుమారుడు రవితేజ ఎంఎస్ చదివేందుకు గతేడాది ఆగస్టులో అమెరికా వెళ్లాడు. టెక్సాస్ రాష్ట్రం ఆస్టిన్ నగరంలో ఓ యూనివర్సిటలో చదువుతున్న రవితేజ ఈనెల 18న మిత్రులతో కలిసి స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లి అందులో మునిగిపోయాడు. మిత్రులు ▶ 2లో



మృతులు జెట్టి హారిక, తాడిబోయిన రవితేజ (ఫైల్‌ఫోటోలు)

చెరువులైన చేలు!


పెదపరిమి - నీరుకొండ మధ్య పొలాలు

ప్రజాశక్తి - తుళ్లూరు

తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాల రైతులకు దు్ణఖదాయినిగా పేరొందిన కొండవీటి వాగు వెతలు వెంటాడుడుతున్నాయి. అధిక వర్షాలతో వాగు పొంగి పంట పొలాలను నీట ముంచుతోంది. వాగు నీటితో పొలాలన్నీ చెరువులను తలపిస్తున్నాయి. వాగు ఉధృతి కారణంగా పంటతో పాటు ప్రాణ నష్టం జరిగిన దాఖలాలు కూడా ఉన్నాయి. కొండవీటివాగు ఫిరంగిపురం మండలం కొండవీడు కొండల్లో నుంచి ప్రారంభమై వరద నీరు మేడికొండూరు, తాడికొండ మండలాల మీదుగా తుళ్లూరు మండలం లోని పెదపరిమి, వెలగపూడి, వెంకటపాలెం, మందడం, మంగళగిరి మండలంలోని నీరుకొండ, కృష్ణాయపాలెంలోని పొలాలను ముంచెత్తుతోంది. రాజధాని నిర్మాణానికి భూములివ్వని రైతులు పత్తి, మినుము, కూరగాయలు సాగు చేస్తున్నారు. వాగు నీరు పొలాల్లోకి చేరడం, రోజుల తరబడి నీరు చేలల్లో నిల్వ ఉండడంతో పైర్లు ఉరకెత్తు తున్నాయని రైతులు వాపోతున్నారు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రభుత్వం, అధికారులు పరిష్కారానికి చర్యలు తీసుకున్న పాపాన పోలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొండవీటి వాగు ఉధతి కారణంగా కోటేళ్ల వాగు, చీకటి వాగు, పెదపరిమి, మోతడక, నీరుకొండ మధ్య వాగులు పొంగడంతో రాకపోకలకు సైతం ఇబ్బంది కలుగుతోందని రైతులు ఆవేదనకు గురవుతున్నారు. వాగులో పూడికలు తీయడం, గుర్రపుడెక్కను తొలగించడంతోపాటు ముంపు నివారణ కోసం నిర్మించిన ఎత్తిపోతల పథకాన్ని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

పల్నాడు జిల్లా జెసిగా సూరజ్ గనోరే ధనుంజయ్



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా సూరజ్ గనోరే ధనంజయ్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన రంపచోడవరం ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ప్రాజెక్టు అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. త్వరలో పల్నాడు జెసిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. జిల్లా ఆవిర్భావం నుండి జాయింట్ కలెక్టర్‌గా పని చేసిన ఎ.శ్యాంప్రసాద్ ఇటీవల మన్యం జిల్లా కలెక్టర్‌గా నియమితులవడంతో అప్పటి నుండి పల్నాడు జిల్లా జెసి పోస్టు ఖాళీగా ఉంది.

కల్తీ వంట నూనెల తయారీ కేంద్రంగా నరసరావుపేట

- తక్కువ ధర నూనెలతో వేరుశనగ, సన్‌ఫ్లవర్ నూనెల్లో కల్తీ
- జీర్ణకోశ వ్యాధులు, కేన్సర్ ముప్పు తప్పదంటున్న వైద్యులు
- పట్టని ఆహార నియంత్రణ విభాగం
- నామమాత్రపు తనిఖీలతో సరి

4 లో

కొత్త చట్టాలతో హక్కులకు ప్రమాదం

క్రిమినల్ చట్టాల అమలును నిలిపివేయాలి : ఐలు రాష్ట్ర కార్యదర్శి

ప్రజాశక్తి-గుంటూరు


మాట్లాడుతున్న నర్రా శ్రీనివాసరావు

న్యాయ కోవిదులతో, రాజ్యాంగ నిపుణులతో ఏ విధమైన చర్చలు, సంప్రదింపులు చేయకుండా అప్రజాస్వామికంగా, హడావిడిగా తీసుకొచ్చిన మూడు క్రిమినల్ చట్టాల అమలును నిలిపివేయాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు కోరారు. 'క్రిమినల్ చట్టాలు - ప్రజలకు శాపాలు' అనే అంశంపై ఆదివారం బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఎల్ఐసి ఎంప్లాయీస్ యూనియన్, మచిలీపట్నం డివిజన్ సంయుక్త కార్యదర్శి వి.వి.కె.సురేష్ అధ్యక్షత వహించారు. ముఖ్యవక్తగా హాజరైన శ్రీనివాసరావు ప్రసంగిస్తూ 'బ్రిటిష్ వాళ్లు తెచ్చిన చట్టాలను రద్దుచేసి కొత్త చట్టాలు చేశామని ప్రభుత్వం చెబుతోందని, అయితే దాదాపు 90 శాతం వరకు అవి పాత చట్టాలకు నమూనాలేనని అన్నారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధినయం పేర్లతో మూడు నూతన నేర చట్టాలను జూలై 1 నుండి అమల్లోకి తెచ్చారన్నారు. జీరో ఎఫ్ఐఆర్, బాధితులకు రక్షణ, టెక్నాలజీ వినియోగం వంటి కొన్ని ఉపయోగాలు ఉన్నాయన్నారు. అయితే పలు నిబంధనలు పోలీసులకు నిరంకుశ అధికారాలను కల్పిస్తున్నాయని, వీటివల్ల పేదలు, బలహీనుల హక్కులు ప్రమాదంలో పడతాయని ▶ 2లో



క్రీడాకారుల్ని అభినందిస్తున్న ఇంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో రాణించాలి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గోరంట్లలోని నెక్ట్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఇండోర్ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి రోప్ స్కిప్పింగ్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా అయ్యన్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ ఐ.ఇంద్రశేకర్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ నిత్యం క్రీడలు సాధన చేయడం ద్వారా మానసిక ఒత్తిడి తగ్గి, నూతన ఉత్తేజం కలుగుతుందన్నారు. క్రీడలు దేశ సమైక్యతకు దోహదం చేస్తాయన్నారు. ఇక్కడ ప్రతిభ చూపిన క్రీడాకారులు కర్నూలు జిల్లాలో ఆగస్టు 10, 11 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. రోప్‌స్కిప్పింగ్ క్రీడను అభివృద్ధి చేయడానికి తిరుపతిరావు చేస్తున్న కృషిని ప్రత్యేకంగా అభినంధించారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు అయ్యన్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ ఐ.ఇంద్రశేకర్‌రెడ్డి నెక్ట్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ హెచ్‌ఒడి కిషోర్ ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ కార్యదర్శి పి.తిరుపతిరావు, ప్రెసిడెంట్ జె.వెంకటేశ్వర్లు, నిర్వహణ కార్యదర్శి ఇమ్మానియేల్‌రాజ్, పిఇటిలు వాసంతి, లక్ష్మి తిరుపతమ్మ, పవన్, చక్రి, రాజమోహన్ పాల్గొన్నారు.

అవోపా ఆధ్వర్యంలో పేదలకు పెన్షన్లు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అరండల్‌పేటలోని అవోపా కార్యాలయంలో అవోపా అధ్యక్షులు కె.వి.బ్రహ్మం అధ్యక్షతన 108 పేదలకు పెన్షన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మద్దు రామకృష్ణయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మద్దు రామకృష్ణయ్య పాల్గొని పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో ప్రతినెల 108 మందికి రూ.500 చొప్పున పెన్షన్లు ఇవ్వటం, డాక్టర్లతో వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు ఇవ్వటం అభినందనీయం అన్నారు. సివిల్స్ కోసం శిక్షణ తీసుకొనే విద్యార్థులకు రూ.3 లక్షలు విరాళం ప్రకటించారు. అవోపా రాష్ట్ర అధ్యక్షులు తడవర్తి రాంబాబు మాట్లాడుతూ వచ్చేనెల 25న ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు రూ.20 లక్షలు స్కాలర్షిప్స్ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు, జిల్లా అధ్యక్షులు చింతా కృష్ణారావు, నగర కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ మద్ది సాయిరమేష్, మట్టుపల్లి రవికుమార్ పాల్గొన్నారు.

సేవలకు ప్రతిరూపంగా లయన్స్ క్లబ్బులు ఎదగాలి

ప్రజాశక్తి-గుంటూరు

లయన్స్ క్లబ్బులు సేవలకు ప్రతిరూపంగా మారటం ద్వారానే సమాజంలో సమస్త మానవాళితోపాటు ప్రకృతి వనరులు కాపాడబడతాయని లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా 316హెచ్ గవర్నర్ పరుచూరి గోపీచంద్ అన్నారు. ఆదివారం స్థానిక జెకెసి కళాశాల సమావేశం మందిరంలో జిల్లా లయన్స్ క్లబ్స్ తొలికార్యవర్గ సమావేశంతో పాటు అన్ని క్లబ్బుల ప్రెసిడెంట్, సెక్రెటరీ, కోశాధికారుల శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫాస్ట్‌డిస్ట్రిక్ గవర్నర్, జిల్లా చీఫ్ అడ్వైజర్ నూతలపాటి వీరప్రకాష్‌రావు మాట్లాడుతూ 2024-25 లయన్స్టిక్ సంవత్సరంలో యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ, పర్యావరణ పరిరక్షణ, క్యాన్సర్ వ్యాధిపై విస్తృత అవగాహన, నిరోధక సేవా కార్యక్రమాల ద్వారా 316హెచ్ జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని కోరారు. జిల్లా క్యాబినెట్ సెక్రెటరీ వి.వి.సుబ్బయ్య, కోశాధికారి డాక్టర్.సిహెచ్ చక్ర పాణి, మాజీ గవర్నర్ కపానందం, ఎం.సి.సి శ్రీనివాసరావు, రీజియన్, జోనల్, డిస్ట్రిక్ట్ చైర్మన్లు, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణం, డ్రెయినేజీ సమస్యలకు ప్రాధాన్యం

పరిశ్రమలు, కంపెనీల ఏర్పాటుకు కృషి : కేంద్ర సహాయ మంత్రి చంద్రశేఖర్

ప్రజాశక్తి -పొన్నూరు

గ్రామీణాభివృద్ధి, గృహ నిర్మాణం, డ్రెయినేజీ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని మామిళ్లపల్లి నుండి దండమూడి, కట్టెంపూడి ఆర్ అండ్ బి రోడ్డు వరకు రూ.5.19 కోట్లతో రోడ్డు నిర్మాణానికి మామిళ్లపల్లిలో మంత్రి చంద్రశేఖర్ ఎమ్మెల్యే నరేంద్రకుమార్‌తో కలిసి ఆదివారం శంకుస్థాన చేశారు. ఈ సందర్భంగా కట్టెంపూడి అడ్డరోడ్డు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమలు, సాఫ్ట్‌వేర్ కంపెనీల ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానన్నారు. వైసిపి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని, కేంద్రం నుండి నిధులు తేవటంలో విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం వాటిల్లుతోందంటూ జగన్ దీక్షలకు పూనుకోవటం హాస్యాస్పదంగా ఉందన్నారు.



క్షేత్రస్థాయిలో ఇలాంటి దుశ్చర్యలను కూటమి శ్రేణులు ప్రతిఘటించాలన్నారు. ఎమ్మెల్యే నరేంద్ర మాట్లాడుతూ ఊపిరి ఉన్నంతవరకు ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం పాటు పడతానన్నారు. నియోజకవర్గానికి మంత్రి చంద్రశేఖర్ తన సహాయ, సహకారాలు కొనసాగించాలని కోరారు. సభలో జెడ్‌పి చైర్‌పర్సన్ హెన్రీ క్రిస్టినా, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, పంచాయతీరాజ్ కమిషనర్ బాలు నాయక్, కూటమి పార్టీల నాయకులు ఎం.వెంకటేశ్వరరావు, వి.మార్కండేయబాబు, వి.నరేంద్ర, సుధాకర్, బి.బాబురావు, యు.సీతారామయ్య పాల్గొన్నారు.

యుజిడి పనుల పునరుద్ధరణకు కృషి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

'ఏళ్ల తరబడి పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని, భూగర్భ మురుగునీటి వ్యవస్థ, డివైడర్లు, పార్కులు, ట్రాఫిక్ ఐలాండ్స్‌లో బ్యూటిఫికేషన్ పనులు వేగంగా జరగాలని కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. కార్పొరేషన్ అధికారులతో తన కార్యాలయంలో ఆయన ఆదివారం సమీక్షించారు. నగరంలో యుజిడి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, తక్షణమే ఆ పనులను పునరుద్ధరించడానికి తగిన నివేదిక రూపొందించాలని ఆదేశించారు. తాగునీరు, బ్యూటిఫికేషన్ వంటి అంశాల పైనా అధికారులు దష్టి పెట్టాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాల రీత్యా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి నిధుల సేకరణకు తనవంతు కృషి చేస్తానన్నారు. నగరంలోని ఆర్ అండ్ బి పరిధిలో ఉన్న రహదారులకు ప్యాచ్ వర్క్ చేయాల్సిన బాధ్యతను నగర పాలక సంస్థ తీసుకోవాలని సూచించారు. టౌన్ ప్లానింగ్‌పై అవినీతి ఆరోపణలు బాగా ఉన్నాయని, కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు.

కుంచనపల్లిలో కష్వీ ఆర్ట్స్ ఇనిస్టిట్యూట్

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

పూర్వ నుండి మానవుడి జీవితంలో అంతర్భాగమైన వివిధ రకాల కళలు మానవుని జీవితంలో సర్వసాధారణమైనవి. ప్రస్తుతం సాంకేతిక యుగములో దూసుకుపోతున్న యువత కలలపై కూడా మక్కువ పెంచుకొని తమ నైపుణ్యాలను పెంపొందించుకుంటున్నారు. లలిత కళలలో భాగమైన చిత్రలేఖనం కూడా ప్రభుత్వ పాత్ర చాటుకుంటుంది. మండలంలోని కుంచనపల్లి జవ్వాజి లక్ష్మీనారాయణ కాంప్లెక్స్‌లో కష్వీ ఆర్ట్స్ ఇన్నిట్యూట్‌ను నిర్వాహకులు ఆదివారం ప్రారంభించారు. అన్ని వయసుల వారు తమ, తమ అభిరుచిని బట్టి వివిధ రకాల కళలను అభ్యసించేందుకు కష్వీ ఇన్నిట్యూట్ ఎంతో



దోహదపడుతుందని కశ్వి ఆర్ట్స్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభించినట్లు నిర్వాహకులు లక్ష్మీకాంత్ తెలిపారు. ఇన్‌స్టిట్యూట్ ప్రారంభం రోజే చిత్రలేఖనంపై మక్కువ ఉన్న విద్యార్థిని, విద్యార్థులు మక్కువ చూపటం శుభ పరిణామమని అన్నారు. విద్యార్థులకు వినోదం కోసం కాకుండా వారి ఎదుగుదలకు ఎంతో చిత్రలేఖనం ఉపయోగపడుతుందని చెప్పారు.

అసెంబ్లీ సమావేశాలకు పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా వెలగపూడి సచివాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. వి.వి ఐపిలు రాక సందర్భంగా సచివాలయం దగ్గర, అసెంబ్లీ ఆవరణలో ముఖ్యమైన ప్రాంతాలు, అసెంబ్లీ దగ్గర లో ఉన్న హెలిప్యాడ్ ప్రాంతం అ చుట్టు పక్కల ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, అసెంబ్లీ సమావేశాలకు బందోబస్తుకు వచ్చిన అధికారులకు, సిబ్బందికి బందోబస్తులో చేయవలసినవి, చేయకూడనివి అధికారులు, సిబ్బందికి వివరించారు. సిఎం చంద్రబాబు నాయుడు, స్పీకర్, మండలి చైర్మన్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వచ్చే మార్గాల్లో ట్రాఫిక్ జామ్ కాకుండా, దారివెంట ఇబ్బందులు కలగకుండా చూడాలని చెప్పారు. ముఖ్యమైన ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తూ అనుమానాస్పద వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం వెలగపూడి సచివాలయం, చుట్టూ ప్రక్కల



ప్రాంతాల్లో అధికారులతో కలిసి పరిసర ప్రాంతాలను హెలిప్యాడ్ ప్రాంతాన్ని పోలీస్ ఉన్నతాధికారులతో పరిశీలించారు. బందోబస్తులో వున్న ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. అసెంబ్లీ బందోబస్తు డ్యూటీ చూస్తున్న అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఎదైనా సంఘటన జరిగితే పై అధికారులకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. దారి వెంట బి.డి టీములు, ఏరియా డామినేషన్ పార్టీలు, డాగ్ స్క్వాడ్ బందాలు, రోప్ పార్టీలు, ట్రోలింగ్ వెహికల్స్ వారికి కేటాయించిన ప్రదేశాల్లో అందుబాటులో వుండాలని సూచించారు. పరిశీలనలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్‌పి కె.శ్రీనివాసరావు, అదనపు ఎస్‌పిలు శ్రీనివాసరావు, హనుమంతు, డిఎస్‌పిలు హనుమంతు, అశోక్ కుమార్ గౌడ్, శాంతకుమార్, రత్నస్వామి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అతిభయం వద్దు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో దగ్గు, జలుబు వంటి శ్వాసకోశ వ్యాధులు రావటం సహజమని, వీటి కోసం అనవసరంగా యాంటీబయాటిక్స్ వాడి వ్యాధినిరోధక శక్తి తగ్గించుకోవద్దని గుంటూరు గవర్నమెంట్ హాస్పిటల్ అసిస్టెంట్ ప్రొఫెసర్, పల్మనాలజిస్ట్ డాక్టర్ వెంకట కళ్యాణ్ అన్నారు. ఆదివారం అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో సీజనల్ వ్యాధులు, శ్వాసకోశ వ్యాధులపై జరిగిన ఆరోగ్య సభకు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించారు. సభలో డాక్టర్ వెంకట కళ్యాణ్ మాట్లాడుతూ ఈ సీజన్‌లో ఎక్కడ చూసినా ఉంటున్న జ్వరాలు, దగ్గు, జలుబులాంటి వాటి పట్ల అతిభయం అవసరం లేదన్నారు. రెండ్రోజులు వేచి చూసి తగ్గకపోతే డాక్టర్‌ను సంప్రదించాలని, మన ఇంటి చిట్కాలతోనే వ్యాధులు తగ్గుముఖం పడతాయన్నారు. భయపడి యాంటీబయాటిక్స్ వాడటంతోనే ఇబ్బందులు ఎదురవుతున్నాయని డాక్టర్‌ను సంప్రదించకుండా వాటిని వాడవద్దని అసలు 70 శాతం వ్యాధులు మన శరీరంలో వ్యాధినిరోధక శక్తివల్లనే నయం అవుతాయని సూచించారు. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకే మందులషాపులు, లేబరేటరీలు, డాక్టర్ల వద్దకు వెళ్లి ఇళ్లు, ఒళ్లు గుల్ల చేసుకోవద్దన్నారు. ప్రతి దానికి మందులషాపులపై ఆధారపడవద్దని, ఏ ల్యాబ్‌కి పడితే ఆ ల్యాబ్‌కి వెళ్లవద్దని చెప్పారు. ఎన్‌ఎబిఎల్ సర్టిఫికేషన్ ఉన్న ల్యాబ్‌లనే సంప్రదించాలన్నారు. అనంతరం డాక్టర్ వెంకటకళ్యాణ్‌ను సభ్యులు సత్కరించారు.

కలలు కల్లలు.. పగిలిన గుండెలు..

(మొదటి పేజీ తరువాయి)

ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. తన బిడ్డను కనీసం కడసారి చూపైనా దక్కేలా మృతదేహాన్ని రప్పించాలని తల్లి వేడుకుంటున్నారు. రెండు ఘటనల్లోనూ మృతులు పట్టణంలో ఒకే ప్రాంతానికి చెందివారు కావటంతో ఆ ప్రాంతంలో బీతావహ వాతావరణం నెలకొంది. బంధువులు, స్నేహితుల రాకపోకలు, ఆర్తనాదాలతో హోంత్తిస్తోంది.

ఇండియన్ కమ్యూనిటీకి మంత్రి చంద్రశేఖర్ ఫోన్

జెట్టి హారిక, తాడిబోయిన రవితేజ మతదేహాలను ఇండియాకు రప్పించడంపై కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్పందించారు. అమెరికాలోని ఇండియన్ కమ్యూనిటీ నాయకులతో ఫోన్ ద్వారా సంప్రదింపులు జరిపారు. ఏ సమస్యా లేకుండా వారి మతదేహాన్ని వారి కుటుంబాలకు అప్పగించాలని సూచించారు. ఏదైనా ఇబ్బందులుంటే ప్రభుత్వం తరపున తాను మాట్లాడతానని హామీ ఇచ్చారు. అనంతరం హారిక, రవితేజ కుటుంబీకులతో ఫోన్లో మాట్లాడి ఓదార్చారు.

కొత్త చట్టాలతో హక్కులకు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి పోలీసులు తమ ఇష్టానుసారంగా వ్యవహరించే అవకాశం ఉందని తెలిపారు. రాజద్రోహ చట్టం ఇక ఎంత మాత్రమూ అవసరం లేదని, దాన్ని రద్దు చేయాలని 2022లోనే సుప్రీంకోర్టు చెప్పినా ఇప్పుడు కొత్త చట్టాల్లో 'జాతి వ్యతిరేక చర్య' అనే అంశాన్ని పొందుపరిచారని, ఇది సహజంగానే అసమ్మతి, బావ వ్యక్తీకరణ వంటి ప్రజల ప్రాథమిక హక్కులను హరించడమేనని విశదీకరించారు. దుర్మార్గమైన ఈ చట్టాల అమలును వెంటనే నిలిపివేయాలని సుమారు 3600 మంది వివిధ రంగాల ప్రముఖులు ప్రభుత్వాన్ని కోరారని, వారి విజ్ఞప్తిని పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత ఇంజినీర్ జి.వెంకట్రావు, ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాలరావు, అవధానుల హరి, వై.నేతాజీ, ఎన్.సదాశివరావు, షేక్ మస్తాన్‌వలి, ఎం.రామకష్ణ, కె.పద్మ, షకీలాబేగం, అబ్దుల్‌సలీం, సి.హెచ్.కుమార్, కె.నళినీకాంత్, బి.సలీం, జి.కిరణ్‌కుమార్, ఎం.సాంబశివరావు పాల్గొన్నారు.

ఘంటసాల చైతన్య సంగీత విభావరి

ప్రజాశక్తి- పెదనందిపాడు రూరల్ : ఊరూరా జన విజ్ఞానం, ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక ఆధ్వర్యంలో పెదనందిపాడు పాత బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన ఘంటసాల చైతన్య సంగీత విభావరి ఆకట్టుకుంది. అధ్యక్షులు కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాజధానిలో 25 అడుగుల అమర గాయకులు ఘంటసాల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, నటరత్న ఎన్టీఆర్, పద్మశ్రీ ఘంటసాలకు భారతరత్న ఇవ్వాలని కోరారు. కృష్ణానది ఇరువైపులా తెలుగు జాతి శాస్త్రవేత్తలు, కవులు, కళాకారులు, స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలు ఏర్పాటు చేయాలన్నారు.

పాశ్చాత్య సంస్కృతి మోజులో కుటుంబ వ్యవస్థకు విద్యార్థులు దూరం

మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చదివించాలని, కార్పోరేట్ పాఠశాలలో పిల్లలను చదివిస్తే వారి భవిష్యత్తు బాగుంటుందన్న ఆలోచన విధానం మారాలని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి విద్యార్థుల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. సత్తెనపల్లి పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయం సమీపంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర గ్రాండ్ కల్యాణ మండపంలో కన్నా రంగయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 41 విద్యార్థులకు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ అత్యధిక మార్కులు సాధించిన 24మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు ఆదివారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులు ఆనం రామనారాయణరెడ్డి, నర్సరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. సభకు సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ ర్యాంకుల మోజులో పడి విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మేధావులు, శాస్త్రవేత్తలు ప్రభుత్వం పాఠశాలలో విద్యను అభ్యసించిన వారేనన్నారు. కార్పోరేట్ పాఠశాల్లో చదివిన విద్యార్థులు పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడి కుటుంబ వ్యవస్థకు దూరమవుతున్నారన్నారు. ప్రైమరీ స్థాయి వారికైనా పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.. కార్యక్రమంలో గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు



విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

టిడిపి నాయకులు యెలినేడి రామస్వామి, దరువూరి నాగేశ్వరరావు, నాగౌతు శవరయ్య ఆళ్ళ అమరేశ్వరరావు జనసేన నాయకులు తవిటి భావన్నారాయణ, టిడిపి నాయకులు కార్యకర్తలు విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



షార్ట్ సర్క్యూట్‌తో మెడికల్ షాపు దగ్ధం

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మెడికల్ షాపు దగ్ధం అయిన ఘటన ఆదివారం పట్టణంలో చోటు చేసుకుంది.భాదితులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని వెంకట్రామా బార్ అండ్ రెస్టారెంట్ పక్కన గల సాయి ఫార్మసీ నందు ఆదివారం తెల్లవారుజామున 3గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయిఅని ఈ మంటలలో సుమారు 20లక్షల విలువ చేసే మందులు కాలిపోయాయని తెలిపారు.ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో సిబ్బంది సంఘటన స్థలం వద్దకు చేరుకొని మంటలను ఆర్పారు.పక్కన ఉన్న దుకణాలకు ఎటువంటి నష్టం జరగకుండా ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పివేశారు.జరిగిన ప్రమాదంపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలియజేశారు. షాపు యజమాని మణి ఈ మెడికల్ షాపు జీవనాధారంగా బ్రతుకున్నాని 20లక్షల వరకు నష్టం జరిగిందని తన కుటంబం రోడ్డున పడుతుందని వాపోయారు.



గొడవలు మానండి ... కలిసి జీవించండి

పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయపురిసౌత్

పల్నాడు జిల్లా ఎస్పీ ఆదివారం పలు పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు.పోలీసు స్టేషన్ల తనిఖీల్లో భాగంగా స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పని తీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్ లో నిర్వహిస్తున్న కేసు డైరీ, వివిధ క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీసు స్టేషన్ పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మహిళా ఫిర్యాది దారులకు వెయిటింగ్ రూమ్ వుండాలని, పెండింగ్ లో ఉన్న వాహనాలను త్వరగా డిస్పోస్ చేయాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాల్లో పర్యటించిన ఎస్పీ, వెల్దుర్తి, దుర్గి పోలీస్ స్టేషన్ల పరిధిలోని గుండ్లపాడు, జంగమహేశ్వరపాడులో ఎస్పీ ప్రజలతో మాట్లాడుతూ ప్రజలు చట్టాలను, గౌరవించాలని శాంతి భద్రతలకు విఘాతం కలిగించరాదని, ఎవరైనా రెచ్చ గొట్టే మాటలు విని ఆవేశపడి గొడవలు తల దూర్చొద్దని సూచించారు. గ్రామాల్లో ఎటువంటి సమస్య ఉన్న పోలీస్ స్టేషన్లకు వచ్చి ఫిర్యాదు చేయాలని లేదంటే తన దృష్టికి తీసుకురావాలని సూచిం చారు. అదేవిధంగా ఎవరైనా గ్రామాల్లో అల్లర్లు సష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, రౌడీ షీట్లు ఓపెన్ చేస్తామని, అయినా ఎక్కువ చేస్తే జిల్లా బహిష్కరణకు చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ

పట్టణంలోని పోలీస్ స్టేషన్‌ను ఆదివారం పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆకశ్మిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాదితులతో కొంతసేపు మాట్లడారు.ఫిర్యాధులు తీసుకుంటున్నారా లేదా అని వారిని అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు సంభందించి పూర్తి వివరాలను పట్టణ సిఐ వెంకట్రావ్ ఎస్పీకి అందజేశారు.ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని సమస్యలు లేకుండా విధులు నిర్వహించాలని ఆయన సూచించారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

వరుస దొంగతనాలతో భయపడుతున్న పట్టణ ప్రజలు

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణం లోని 14 వ వార్డులో సాయిబాబా గుడి సమీపంలో గుడికి వెళుతున్న మహిళ మెడలోని నాన్ తాడును గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి లాక్కొని పోయారు. అదే వార్డుకు చెందిన పాల్వాయి సత్యవతి గుడి దగ్గర కు వెళుతుండగా ఘటన జరిగింది.గొలుసు లాక్కుపోతుండగా అప్రమత్తమైన మహిళ గొలుసు పట్టుకోవడంతో చిన్న ముక్క చేతిలో మిగిలిపోయింది, మిగతాది దుండగులు లాక్కొని పోయారు. ఆరు సవర్ల నాన్తాడు లో ఎక్కువ భాగం చోరీకి గురైంది. పట్టణంలో ఈ మధ్యకాలంలో



వరుస దొంగతనాలు జరుగుతుండడంతో పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత రెండు నెలల్లో ఇది మూడవ దొంగతనం కావడంతో పోలీసులపై ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గతంలో ఈ ప్రాంతంలోనే రెండుసార్లు చైన్ దొంగతనాలు జరిగాయి..పట్టణ సిఐ,ఎస్ఐలు సంఘటన స్థలానికి వచ్చి పరిశీలన జరుపుతున్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల మెరుపు దాడి

- 24 మంది అరెస్ట్
- రూ. 3,12,750 నగదు పట్టివేత
- రెండు కార్లు, రెండు ఆటోలు, 7 ద్విచక్ర వాహనాలు, 24 సెల్ ఫోన్లు స్వాధీనం

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా గల బైబిల్ మిషన్ వెనుకాల గల మామిడి తోట యందు పేకాట ఆడుతున్న ట్లు రావడం పై మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ ,ప్రొబేషనరీ డి.ఎస్.పి గారైన భార్గవి , సిబ్బంది కలసి రైడ్ చేయగా 24 మంది వ్యక్తులను అరెస్టు చేసి పట్టుకొని వారి వద్ద నుండి ఆడుతున్న పేక ముక్కలు మూడు లక్షల 12750 నగదు ,రెండు కార్లు, రెండు



ఆటోలు, ఏడు ద్విచక్ర వాహనాలు,24 సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకొని సదరు పేకాట ఆడుతున్న 24 మందిని అదుపులోనికి తీసుకున్నట్లు వారు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి తదుపరి కోర్టు వారి ముందు హాజరు పరిచినట్లు తెలిపారు. మండల పరిధిలో పేకాట కోడిపందాలు ఇతర జూదాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒకరు అరెస్ట్

ప్రజాశక్తి - మాచర్ల



వెల్దుర్తి మండలం శ్రీరాంపురం తండాలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సామలు నాయక్ అనే సుగాలి వ్యక్తిని 21వ తారీకు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ పోలీసులు అరెస్ట్ చేశారు. శ్రీరాంపురం తండాలోని బస్టాండ్ సమీపంలో అదుపులోకి తీసుకొని అతని వద్ద 180 ఎం.ఎల్ 48 బాటిల్స్ నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు పెట్టి కోర్ట్ లో హాజరు పరచనున్నట్లు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సిఐ కిషోర్ తెలిపారు.

నడకదారి విషయమై ఘర్షణ - ముగ్గురుకి గాయాలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

నడకదారి విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది.ఈ సంఘటన సత్తెనపల్లి మండలం వెన్నాదేవి సమీపంలో ఆదివారం జరిగింది. ఈఘటనలో ఇరువర్గాలకు చెందిన రాట్నాల శంకర్ తీవ్రంగా గాయపడగా ఆదూరి సుభాషిణి మాదంశెట్టి హుస్సేన్ రావులు స్వల్పంగా గాయపడ్డారు. రాట్నాల శంకర్ మాదంశెట్టి హుస్సేన్ రావులకు మధ్య కొంతకాలంగా నడకదారి విషయంలో వివాదం నెలకొంది.దారిపక్కన వేసిన పూల మొక్కలు విషయంపై గొడవపడ్డారు. ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. గాయపడిన వారిని సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం శంకర్ ను సుభాషిణి ని గుంటూరు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - మేడికొండూరు

మండల కేంద్రమైన మేడికొండూరు పోలీస్ స్టేషన్లో ఆదివారము స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఎస్హెచ్ఓ దార్ల జయకుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తన కలిగి సుడు మార్గాన్ని విడనాడి మంచి మార్గంలో నడవాలని దిశా నిర్దేశం చేశారు. ప్రవర్తనలో మార్పు రాని వారి పైన పీడీ యాక్ట్ కేసులు నమోదు చేసి ఆస్తులు జప్తు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.

కల్తీ వంట నూనెల తయారీ కేంద్రంగా నరసరావుపేట

- తక్కువ ధర నూనెలతో వేరుశనగ, సన్‌ఫ్లవర్ నూనెల్లో కల్తీ
- కల్తీలతో జీర్ణకోశ వ్యాధులు, కేన్సర్ ముప్పు తప్పదంటున్న వైద్యులు
- పట్టించుకోని ఆహార నియంత్రణ విభాగం
- నామమాత్రపు తనిఖీలతో సరి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రోడ్డుపక్కన బండిపై తయారయ్యే పకోడి, బజ్జీలు ఎంతో ఇష్టపడి తింటాము. రెస్టారెంట్లకు వెళ్లి ఫ్రై ఐటమ్స్ లొట్ట లేసుకుంటూ ఆరగిస్తాము. అప్పటి వరకు నోటి రుచికి అవి బాగానే ఉంటాయి. లోపలికి వెళ్లాక దానిని జీర్ణం చేయడానికి శరీరం పడే కష్టం అంతా ఇంతా కాదు. ఈ క్రమంలో అటువంటి ఆహారం పలు వ్యాధులకు గురవు తున్న విషయం తెలియక చాలా మంది రుచికి అలవాటు పడి కల్తీ నూనెతో తయారు చేసిన ఆహారాన్ని మరీ తింటున్నారు. కల్తీని నిరోధించాల్సిన ఆహార భద్రత అధి కారులు ఆ విషయాన్నే మరిచిపోయినట్లు వ్యవహరిస్తు న్నారు. నరసరావుపేట కేంద్రంగా పలురకాల నాణ్యతలేని నూనెలు ఆకర్షణీయంగా ప్యాకింగ్ చేసి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నా, ఆహార నియంత్రణ విభాగం అధి కారులు తూతూ మంత్రంగా దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయడం మినహా క్షేత్ర స్థాయిలో చర్యలు తీసు కున్న దాఖలాలు లేవు. రాజకీయ ఒత్తిడి కావచ్చు, మామూళ్ల నేపథ్యం కావొచ్చు పరిస్థితి ఏమైనా దాడుల తీవ్రత తగ్గించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నామమాత్రపు తనిఖీలతో సరి!

జిల్లాలో విచ్చలవిడిగా కల్తీనూనె విక్రయాలు జరుగు తున్నా ఆహార నియంత్రణ విభాగంలోని అధి కారులు పట్టించుకోవడం లేదు. ఏడాదికి ఒకటి, రెండుసార్లు తనిఖీలు చేసి మమ అనిపిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుండి ట్యాంకర్ల ద్వారా పలు ఆయిల్ మిల్లులకు కల్తీ వంట నూనె జిల్లాకు వస్తున్నా పట్టించుకోవడం లేదు. ఏ నాడూ నూనె మిల్లులకు వెళ్లి పరిశీలించి కేసులు నమోదు చేసిన దాఖలాలు లేవు. ఆయా మిల్లుల్లో ఆకర్షణీయమైన ప్యాకింగ్ తో మార్కెట్ వచ్చినా అక్కడ కూడా వాటి నమూనాలు సేకరించకపోవడంతో నూనె వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఖరీదైన వంటనూనెల్లో కల్తీ

మార్కెట్ లో బ్రాండెడ్ వంటనూనెలకు ఉన్న డిమాండ్ అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారింది. మార్కెట్‌లో పేరున్న కంపెనీలను పోలిన బ్రాండ్ పోలికతో ముద్రించి నకిలీ నూనెలను అమ్ముతున్నారు. ఇతర రాష్ట్రాల నుండి ఓడ మార్గం ద్వారా అధిక శాతం రాష్ట్రం లోకి తక్కువ రకం కల్తీ నూనె దిగుమతి అవుతున్న విషయం ప్రతి ఒక్కరికి తెలిసిందే. ఇదే తరహాలో ఇతర ప్రాంతాల నుండి ట్యాంకర్ ద్వారా వచ్చిన మార్గరిన్, పామాయిల్, వేరుశనగ, సన్ఫవర్ నూనెలు అందమైన ప్యాకెట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. ఎక్కువగా ఇలాంటి వంట నూనెలను రోడ్డు పక్కన వ్యాపారం చేసే తోపుడు బండ్లు, చిరువ్యాపారులకు అంటగడుతున్నారు. ఈ నూనెలతో చికెన్, మటన్, ఫిష్ తో పాటు పలు రకాల బజ్జీలు, వడలు తయారు చేసి విక్రయిస్తున్నారు. కొన్ని హోటళ్లు, రెస్టారెంట్ల లోనూ ఇలాంటి నూనెనే వాడుతున్నా రన్న విమర్శలు ఉన్నాయి. మార్కెట్ రేటు కంటే ఈ నూనె ప్యాకెట్లు సగం ధరకే లభిస్తుండటంతో వ్యాపారులు వాటి వినియోగానికే మొగ్గు చూపుతున్నారు.

ఇలాంటి నూనెలు వాడాలి

నూనెలో మోనో అన్ సాచ్యురేటెడ్, పాలి అన్ సాచ్యురేటెడ్, ఒమెగా 3 ఫ్యాటీ ఉండేలా చూసుకోవాలి. ఈ 3 రకాలు ఏ నూనెలో ఎక్కువ పరిమాణంలో ఉం టాయో అవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఇలాంటి నూనెలు వాడడం ద్వారా చెడు కొలెస్ట్రాల్ (ఎల్డీఎల్)ను తగ్గించి హెచ్ఎల్ కొలెస్ట్రాల్ ను పెంచుతాయి. దీంతో గుండెకు మేలు కలుగి రక్తనాళాలు పూడిపోవు. బరువు పెరగరు. దీనివల్ల గుండెపోటుకు గురయ్యే అవకాశం బాగా తగ్గుతుంది. ఇవి శరీరంలో యాంటి ఇన్ ఫ్లేమ టరీగా కూడా పనిచేస్తాయి. వినియోగించే నూనెలో అదనంగా ఎక్కువగా కెమికల్ ప్రాసెసింగ్ లేకుండా తయారు చేసినదై ఉండాలి. ఇది ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. కొంచెం ధర ఎక్కువైనా ఆరోగ్యానికి మేలు చేస్తాయి. గానుగల్లో తయారైన నూనెలు ఈ తెగకు చెంది నవి. వీటిలో వంటకు, ఆరోగ్యానికి సన్ ఫ్లవర్, వేరుశనగ నూనె మంచివని వైద్యులు సూచిస్తున్నారు.

వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది

డాక్టర్ ఐలా శ్రీనివాస్

శకుంతల జనరల్, గ్యాస్ట్రో లివర్ కేర్ హాస్పిటల్



కల్తీనూనెలు వాడితే వ్యాధు లు, స్థూలకాయం, కేన్సర్, పిత్తాశయంలో రాళ్లు ఏర్పడ తాయి. ఎంత మంచి నూనె అయినా ఒకసారి వేడి చేసి వాడిన తర్వాత మళ్లీ వాడకూడదు. ఇలాంటివి హోటల్స్, రోడ్డు ప్రక్కన చిరు వ్యాపారస్తులు ఎక్కువగా వాడతారు. నూనెను మళ్లీ వేడి చేసి వాడటం వల్ల దాంట్లో ఫ్రీ రాడికల్స్, ఆల్డి హైట్స్ తయారవుతాయి. ఇవి మనిషిలో వ్యాధి నిరోధక శక్తిని తగ్గించి అనేక వ్యాధులకు కారణ మవుతాయి. వంట నూనెలు కొనుగోలు చేసేటప్పుడు ఏమేమి ఎక్కు వగా ఉంటాయనేది ప్యాకెట్ పై ముద్రించి ఉంటుంది. పాలి అన్ సాచ్యురేటెడ్ ఉన్నది చూసి కొనుగోలు చేయాలి. సాచ్యురేటెడ్ ఫ్యాట్, ట్రాన్స్ ఫ్యాట్స్ అని ప్రచు రించిన నూనె ప్యాకెట్లు వినియోహిం చడం శ్రేయస్కరం కాదు.



ఎపిఆర్‌డిసి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న చిత్రం

ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరికీ హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి-విజయపురిసౌత్

ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పక హెల్మెట్ ధరించాలి మాచర్ల మండలం విజయపురిసౌత్ లోని స్థానిక గురుకుల డిగ్రీ కళాశాలలో వాహన ప్రమాదాలపై అవగాహన సదస్సు కళాశాల అధ్యాపక బృందం ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో అడిషనల్ సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ మాచర్ల ఎస్. శ్రీనివాస కళ్యాణ్, ప్రెసిడెంట్ బార్ అసోసియేషన్ మాచర్ల జె. శ్రీనివాసరావు, విజయపురి సౌత్ ఎస్సై ఎం.పట్టాభి రామయ్య, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ జి. వెంకటేశ్వర్లు, సీనియర్ అడ్వకేట్ సత్యనారాయణ రెడ్డి, సివిల్ అడ్వకేట్ సిహెచ్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. వాహన ప్రమాదాలు, దేశ రక్షణ విధానము, యువత మేలుకొలుపు విధానము, యువత బాధ్యతల గురించి వివరించారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పక హెల్మెట్ ధరించాలని, ఫోర్ వీలర్ నడిపేవారు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని , తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్య క్రమంలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఎస్.కె మహ మ్మద్ బాషా, ఎస్. నయీం భాను,కళాశాల అధ్యాపకుల బృందం సదస్సులో పాల్గొని విజయవంతంగా నిర్వహించారు.



పేద కుటుంబాలకు నిత్యావసరాల వితరణ

ప్రజాశక్తి-వినుకొండ

బ్రాహ్మణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు జి.వి. మాధవరావు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కార్యాలయంలో పది నిరుపేద కుటుంబాలకు బియ్యం,నూతన వస్త్రములు అందజేశారు. ఈ నెలలో దాతలు చింతలచెర్వు రాఘవేంద్ర రావు,పుట్టంరాజు నారాయణ రావు ,శ్రీనివాసుని శ్రవణ్ కుమార్, దేవులపల్లి విశ్వనాథ శాస్త్రి ,అనఘా గోపాల క్రిష్ణ మూర్తి, అప్పరాజు రామకృష్ణ, అక్కి రాజు శశికళ (హైదరాబాద్) రెండు కుటుంబ ములకు , చింతలపూడి భద్రయ్య, మతుకుమల్లి మురళీధర్ ,అనఘా సుబ్బారావు, చింతలపూడి హరనాథ్ బాబు (గుంటూరు) సహాయ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వినుకొండ 5 వ వార్డు కౌన్సిలర్ పోలూరి అంజలి దేవి, సుబ్బారావును ఘనంగా సత్కరించారు.

కనువిందు.. ఎత్తిపోతల జలపాతం..

ప్రజాశక్తి-విజయపురిసౌత్



ఎగువన గత నాలుగు రోజులుగా కురు స్తున్న వర్షాలకు ఎత్తి పోతల జలపాతం కళకళ లాడు తోంది. 70 అడు గుల ఎత్తు నుండి జాలువారు తున్న జలపాతం అందాలను చూసేందుకు సందర్శకులు అధిక సంఖ్యలో వస్తున్నారు. ఆదివారం సెలవు రోజు కావడంతో సందర్శకుల తాకిడి ఎక్కువగా కన్పించింది. వాటర్ ఫాల్స్ అందాలను సందర్శ కులు తమ కెమెరాల్లో బంధించారు. అలాగే, దత్తాత్రేయ, రంగ నాయకుల స్వామి వారిని అధిక సంఖ్యలో సందర్శకులు దర్శించుకున్నారు.

రీ సర్వే కొనసాగుతుందా?

తప్పులను సవరించి ఈ సర్వేను కొత్త ప్రభుత్వం ముందుకు తీసుకెళుతుందా?

ప్రజాశక్తి-పెదకూరపాడు

నూతన ప్రభుత్వం భూముల రీ సర్వేను కొన సాగిస్తుందా లేక నిలిపివేస్తుందా అనే విషయం అంతు పట్టడం లేదు. పల్నాడు జిల్లాలో సగానికి పైగా రెవెన్యూ గ్రామాల్లో భూముల ఈ సర్వే ప్రక్రియ పూర్తయింది. వీటన్నింటికీ సంబంధించి భూ లావాదేవీలు, రిజిస్ట్రేషన్లు ..నూతనంగా కేటాయించిన ల్యాండ్ పార్సిల్ మ్యాప్ (ఎల్ పి ఎం) ల ఆధారంగా జరుగుతున్నాయి. తాజాగా ప్రభుత్వం మారడంతో ఈ సర్వే ముందుకు సాగడంపై సందిగ్ధత నెలకొంది. రీ సర్వేకు అవసరమైన అత్యంత ఖరీదైన ఆధునిక పరికరాలను, సర్వేలో కీలకమైన రోవర్లను గత ప్రభుత్వం జిల్లా యంత్రాంగానికి అందిం చింది. జిల్లా నుండి అవసరమైన ప్రాంతాలకు వీటిని పంపిణీ చేశారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని ఐదు మండలాలు అమరావతి, అచ్చం పేట, క్రోసూరు, బెల్లంకొండ, పెదకూరపాడు. ఈ ఐదింటిలో అన్ని మండలాల కంటే పెదకూరపాడులోనే ఎక్కువ రీ సర్వే పూర్తి చేశారు. మండలంలో 20 పంచాయితిలు ఉన్నాయి. 14 రెవెన్యూ గ్రామాలు విభజించారు. ఈ సర్వేలో భాగంగా 11 రెవిన్యూ గ్రామాల్లో డ్రోన్ ఫ్లయింగ్ ను పూర్తి చేశారు. హుస్సేన్‌నగరం, జలాల్పురం, లగడపాడు, గారపాడు, చిన్నమక్కెన, ఖమ్మంపాడు, కాశిపాడు, ముసాపురం, పాటిబండ్ల, రామాపురం, తాళ్లూరు గ్రామాలకు 13 నోటిఫికేషన్ విడుదల చేశారు. వాటికి హద్దురాళ్లను పాతారు. రీ సర్వే పూర్తయిన గ్రామాలకు సంబంధించి భూములు రిజిస్ట్రేషన్ ప్రక్రియ లావా దేవీలను ఎల్‌పిఎం ఆధారంగానే జరుగుతున్నాయి. బలుసుపాడు రెవెన్యూ గ్రామంలో రీ సర్వే పూర్తయింది. 13 నోటిఫికేషన్ కూడా విడుదల చేశారు. కానీ, అడంగళ్ నమోదు పూర్తి కాలేదు. దీంతో, సర్వే నెంబర్ల ఆధారం గానే లావాదేవీలు జరుగుతున్నాయి. పెదకూరపాడు, లింగంగుంట్ల రెవిన్యూ గ్రామాల్లో ఎటువంటి రీ సర్వే జరగలేదు. దీంతో సర్వే నెంబర్లు ఆధారంగా లావాదేవీలు జరుగుతున్నాయి.



హుస్సేన్‌నగరంలో రీ సర్వే చేస్తున్న చిత్రం (ఫైల్)

రీ సర్వే సవాళ్లు ఇలా!

బ్రిటిష్ కాలం నాటి చట్టాలలో ఎకరానికి ఐదు సెంట్లు పెరగడం తగ్గడం వెసులుబాటు ప్రక్రియ ఉంది. వైసిపి ప్రభుత్వం చేసిన రీ సర్వేలో నాలుగు గట్ల మధ్య కొలతలు వేసి అయిందనిపించారు. ఒక్కొక్క సర్వే నెంబరు ఎకరం తేల్చటానికి రెండు,మూడు రోజులు పట్టే అవకాశం ఉంటుంది. గ్రామానికి నాలుగు టీమ్‌లు వేయడం హడావుడిగా గట్ల మధ్య కొలవడం పని పూర్త యిందని పించారు. రికార్డుల్లో ఉన్న దానికన్నా క్షేత్ర స్థాయిలో తమకు రీ సర్వేలో భూ విస్తీర్ణం తగ్గిపోతోందని ఫిర్యాదులు చేశారు. 'తర్వాత చూద్దామని' వాటిని దాటవేసే ధోరణి ఎక్కువగా అవలంబించారు. బలవంతంగా ఆక్రమించుకున్న వారికి రాజముద్ర పడి నట్లు అయింది. గ్రామ సర్వేలకు టార్గెట్లు ఇచ్చారు. పూర్తి చేయకపోతే షోకాజులు, సస్పెండ్ అంటూ హడావుడి చేశారు. దీంతో తప్పులు దొర్లాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తప్పును సవరించే అవకాశం కూడా లేదు. దీంతో, కొంతమంది రైతులు రీసర్వే దగ్గరకు రాలేదు. అధికారులే కొలిచి హద్దు రాళ్ల వేశారు. రీ సర్వే రాళ్లపై జగన్ బొమ్మ వేయడం, తద్వారా వచ్చిన పాస్ పుస్తకాలపై అప్పటి ముఖ్యమంత్రి ఫొటో ఉండటంతో రైతులలో తీవ్ర అను మానం, అసహనం వ్యక్తం చేశారు. ఈ సర్వే ప్రక్రియలో అనేక సమస్యలు ఎదురయ్యాయి. గత ప్రభు త్వంపై ప్రజల ఆగ్రహానికి రీసర్వే ప్రక్రియ కారణంగా ఉంది. భూ యజమానుల్లో భయానికి కారణమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసినట్లు నూతన ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో నూతన ప్రభుత్వం తప్పులను సవరించి ఈ సర్వే ముందుకు తీసుకెళుతుందా లేదా అన్నది చూడాలి.

సామాజిక రక్షణ చట్టం చేయాలి

- రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కరయ్య
- మంగళగిరి-తాడేపల్లి నగర మహాసభలో సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



జెండా ఆవిష్కరణలో నాయకులు, ప్రతినిధులు, మహాసభలో మాట్లాడుతున్న ఎన్.భాస్కరయ్య (ఇన్‌సెట్)

ప్రజాశక్తి-తాడేపల్లి

రజక వృత్తిదారులకు సామాజిక రక్షణ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చేయాలని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.భాస్కరయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఏర్పడిన ప్రభుత్వం బిసి సామాజిక వర్గానికి ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న హామీలను అమలు చేయాలని కోరారు. ఆదివారం తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో బొజ్జా సుబ్బారావు అధ్యక్షతన రజక వృత్తిదారుల సంఘం మంగళగిరి, తాడేపల్లి నగర మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం రజకవృత్తిదారులు, ఉద్యోగ, కార్మిక, అపార్టుమెంట్ వృత్తిదారులు ఐక్యంగా కృషి చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో రజకులు శ్రమకు తగిన వేతనాలు అడిగిన సందర్భంలో అగ్రకుల పెత్తందారులు దాడులు, సాంఘిక బహిష్కరణలకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చర్యల వల్ల గ్రామాల్లో పనుల్లేక పట్టణ ప్రాంతాల్లో అపార్టుమెంట్ వాచ్‌మెన్, ఇస్త్రీ వారిగా జీవనోపాధి పొందుతున్నారన్నారు. ఇక్కడ కూడా యాజమాన్యాల నుండి అక్రమ కేసులు, దాడులు, దౌర్జన్యాలతో పాటు రజక మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 50 ఏళ్లు నిండిన ప్రతి వృత్తిదార్లకు వృద్ధాప్య పింఛను మంజూరు చేయాలని కోరారు. రజక అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్లు విధివిధానాలు రూపొందించి నిధులు మంజూరు చేయాలని కోరారు. లాండ్రీ వృత్తిదారులకు నెలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆదరణ పథకం ద్వారా వృత్తికి అవసరమైన పనిముట్లు నాణ్యమైన వాటిని అందించాలన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మంగళగిరి, తాడేపల్లి పరిధిలోని రజక వృత్తిదారులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. జిల్లా సహాయ కార్యదర్శి బొజ్జా సుబ్బారావు మాట్లాడుతూ తాడేపల్లి పట్టణంలో నిర్మాణాల్లో ఉన్న చాకలి ఐలమ్మ రజక కమ్యూనిటీ హాలు నిర్మాణాన్ని పూర్తి చేయడానికి స్థానిక ఎమ్మెల్యే లోకేష్ చొరవ చూపాలన్నారు. మహాసభ ముందుగా జిల్లా గౌరవాధ్యక్షులు ఈమని రామారావు జెండాను ఆవిష్కరించారు. అమరజీవి ఐలమ్మ, సత్తెనపల్లి రామకృష్ణ చిత్రపటాలకు వి.వెంకటేశ్వరరావు, ఎన్.భాస్కరయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నూతన కమిటీ

ఎపి రజక వృత్తిదారుల సంఘం మంగళగిరి, తాడేపల్లి నగర కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్ష కార్యదర్శులుగా ఉండవల్లి పార్థసారథి, పాగోలు శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులుగా ఎం.సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా సుబ్బారావు, కె.యానాదిరావు, టి.ఆంజనేయ వరప్రసాద్, సహాయ కార్యదర్శులుగా గిరిరాజు, సాంబశివ రావు, డి.వెంకటేశ్వరరావు, కోశాధికారిగా టి.లక్ష్మీనారాయణ, మరో 13 మంది సభ్యులు ఎన్నికయ్యారు.

పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలి : సిపిఎం

వర్షంతో నీరు నిలిచిన ప్రాంతాల్లో పరిశీలన



లోతట్టు ప్రాంతాల్లో పరిశీలిస్తున్న పాశం రామారావు, ఇతర నాయకులు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని అధికారులను సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. పట్టణంలోని పోలకంపాడు పుష్కర కాలనీలో సిపిఎం నాయకులతో కలిసి ఆయన ఆదివారం పర్యటించారు. స్థానిక ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రామారావు మాట్లాడుతూ నాలుగు రోజుల నుంచి కురుస్తున్న నానుడు వర్షాలకు పట్టణంలోని పలు ప్రాంతాలు జలమయం అయ్యాయని చెప్పారు. అనేక కాలనీల్లో దారులన్నీ చిత్తడిచిత్తడిగా మారి వాహనాల రాకపోకలకు, ప్రజలు నడవడానికి వీల్లేకుండా ఉన్నాయని చెప్పారు. నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు వ్యాప్తి చెంది అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన వెలిబుచ్చారు. ఎమ్‌టిఎంసి అధికారులు వెంటనే క్లోరినేషన్ చేయాలని కోరారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో ఇంజిన్, మోటార్లు పెట్టి తోడించి బ్లీచింగ్, ఆయిల్ చల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైద్యశాలల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచడంతో పాటు పారిశుధ్యం అధ్వానంగా ఉన్న ప్రాంతాల్లో సిబ్బందిని పంపించి ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో పిచ్చిచెట్లు తొలగించాలన్నారు. మురుగునీరు పారుదలకు డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక ఇళ్ల ముందుకు వస్తున్నాయని, వీటి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టణంలోని రామయ్య కాలనీ, ఇస్లాంపేట, పోతురాజుస్వామి గుడి, బోటుయార్డు తదితర ప్రాంతాలు జలమయం అయ్యాయని, అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. పుష్కరాలు సందర్భంగా ఇళ్లు తొలగించిన కార్మికులకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు మంత్రి లోకేష్ ఇచ్చిన హామీ మేరకు తాడేపల్లిలో ప్రభుత్వ స్థలాల్లో ఉంటున్న పేదలకు ఇళ్లపట్టాలు మంజూరు చేయాలన్నారు. పరిశీలనలో సిపిఎం నాయకులు కె.కరుణాకరరావు, డివి భాస్కరరెడ్డి, కె.మేరి, కాళిదాసు పాల్గొన్నారు.

బలం తగ్గినా వాపు తగ్గని బిజెపి

దేశంలో బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. సిపిఎం పట్టణ, రూరల్ కమిటీల విస్తృత సమావేశం తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో ఆదివారం నిర్వహించారు. రామారావు మాట్లాడుతూ గత రెండు సార్లు ఎన్నికల కంటే ఈ సారి ఎన్నికల్లో బిజెపి బలం తగ్గిందని, అయినా ఆ పార్టీ వాపు మాత్రం తగ్గలేదని విమర్శించారు. రాజ్యాంగ వ్యవస్థలను నాశనం చేసి చట్టసభల్లో సంప్రదాయ పద్ధతులను పాటించడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశ్నించే గొంతుకలను అణిచివేయడానికి దుర్మార్గమైన క్రిమినల్ చట్టాలను తీసుకొచ్చారని దుయ్యబట్టారు. బిజెపి తీసుకొచ్చిన చట్టాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిత్యం ఆందోళన చేసే వారిని విచారణ లేకుండా జైల్లో పెట్టే పద్ధతి సరైనది కాదని మండిపడ్డారు. పోలీసులకు విచక్షణాధికారాలు ఇచ్చి నియంతృత్వానికి బాటలు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలానికి అనుకూలంగా బిజెపి తీసుకొచ్చిన చట్టాలు ఉన్నాయని విమర్శించారు. రైతు పోరాటాలు నడిచిన చోట బిజెపిని చిత్తుచిత్తుగా ఓడించారని వివరించారు. రాష్ట్రంలో ఏ మాత్రం బలంలేని బిజెపికి టిడిపి, జనసేన పార్టీలు ఊపిరి పోశాయని, బిజెపితో ఆ రెండు పార్టీలకు భవిష్యత్తులో ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదా, పోలవరం నిర్మాణం, రాజధాని అభివృద్ధికి నిధులు రాబట్టేందుకు టిడిపి, జనసేన కృషి చేయాలని కోరారు. ప్రతిపక్ష పార్టీలను కలుపుకుని కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, నాయకులు బి.వెంకటేశ్వర్లు, డి.శ్రీనివాస కుమారి, జి.సుబ్బారెడ్డి, కె.కరుణాకరరావు, డి.వెంకటరెడ్డి, పి.కృష్ణ, ఎన్.విజయరాజు, బి.గోపాలరావు ఎన్.కిషోర్ పాల్గొన్నారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను కలిసిన మంత్రి సత్యప్రసాద్

ప్రజాశక్తి-తెనాలి

రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదివారం గుంటూరులో మాజీ మంత్రి, టిడిపి సీనియర్ నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.





సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డి.వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆదివారం తాలూకాలోని పెన్షనర్స్ హోమ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నూతన ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడుని కలిసి పెన్షనర్ల సమస్యలను వారి దృష్టికి తీసుకెళతామన్నారు. ముఖ్యంగా 11వ పిఆర్‌సిలో తగ్గించిన అడిషనల్ క్వాంటమ్ తిరిగి పునరుద్ధరించుకోవటం, 11వ పిఆర్‌సి అరియర్స్, డిఎ అరియర్స్, సాధించటానికి జెఎసి నాయకత్వంతో కలిసి కృషి చేస్తామని చెప్పారు. రాష్ట్ర కోశాధికారి టివిఎస్ఎస్ శర్మ మాట్లాడుతూ పదేళ్లుగా సంఘం ఆదాయ వ్యయాలను సభ్యులకు వివరించారు. రాష్ట్ర సహాధ్యక్షులు జివిఎస్.అబ్దుల్ మాట్లాడుతూ సంఘ సభ్యులు సమాజ సేవ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రభుదాసు మాట్లాడుతూ సంఘ బలోపేతానికి కృషి చేయాలన్నారు. పెన్షనర్లకు హెల్త్‌కార్డులపై క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ అన్ని హాస్పిటల్స్‌లో అన్ని వ్యాధులకు జరిగే విధంగా ఏర్పాట్లు చేయాలని, మెడికల్ రియంబర్స్‌మెంట్ పరిమితి రూ.2 లక్షల నుండి రూ.5 లక్షలకు పెంచాలని కోరారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.పెద్దన్నగౌడ్ ఇహెచ్ఎస్‌కు బదులు కార్పొరేషన్ ఏర్పాటు చేసి, రూ.వెయ్యి కోట్లతో నిధి ఏర్పాటు చేస్తే ఇహెచ్ఎస్ ద్వారా వైద్యం పూర్తి స్థాయిలో అందరికీ అందుతుందని అన్నారు. సమావేశంలో అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు నూతన శాఖ ప్రారంభం

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక రామలింగేశ్వరపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన కనక మహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు నూతన శాఖను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ సహకార బ్యాంకులు ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు. పేద, మధ్యతరగతి వారికే కాకుండా రైతులకు కూడా రుణాలు అందించేలా చొరవచూపాలని బ్యాంకు యాజమాన్యాన్ని కోరారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల అవసరాలకు అనుగుణంగా కో-ఆపరేటివ్ బ్యాంకులు సేవలందిస్తున్నాయన్నారు. ప్రస్తుతం తెనాలి ప్రాంతవాసులకు కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు సేవలు అందుబాటులోకి రావటం హర్షణీయమన్నారు. బ్యాంకు చైర్మన్ కె.రాంబాబు మాట్లాడుతూ ఖాతాదారుల అవసరాలకు అనుగుణంగా సేవలందించేందుకు బ్యాంకు సిద్ధంగా ఉందన్నారు. తెనాలిలో 31వ శాఖను ప్రారంభించటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ మాజీ చైర్మన్ నన్నపనేని రాజకుమారి, కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం, బ్యాంకు డైరెక్టర్ సిపి రామారావు, ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.శ్యామ్ కిషోర్, మేనేజర్ బొప్పన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.





ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులుగా ఖాసిం, సూరి

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల తాలూకా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం స్థానిక ఎన్జీవో కార్యాలయంలో ఆదివారంజరిగింది. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షునిగా నీటిపారుదల శాఖలో పనిచేస్తున్న ఎస్కే ఖాసింను, వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న టీ నాగేశ్వరరావు సెక్రటరీగా, వైద్యారోగ్య శాఖలోనే పనిచేస్తున్న కె.సుశీల ను ట్రెజరర్‌గా ఏకగ్రీవంగాఎన్నుకున్నారు. కార్యక్రమానికి అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వర రావు, గుంటూరు సిటీ అధ్యక్షులు ఎస్‌పిఎస్‌సూరి హాజరయ్యారు.



అమరేశ్వరాలయంలో గురుపౌర్ణమి

ప్రజాశక్తి- అమరావతి



గురుపౌర్ణమి సందర్భంగా అమరావతిలోని శ్రీ బాల చాముండిక సమేత అమరేశ్వర స్వామివారి దేవస్థానంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకంబరి అమ్మవారిగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుండి సందర్శకులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ కార్యవాహణాధికారి వేమూరి. గోపీ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గురు పౌర్ణమి సందర్భంగా స్థానిక శ్రీ సత్య సాయి పర్తి సాయి కపోతేశ్వర ధ్యాన మందిరంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ చేకూరి జాజిబాబు, దాతల సహకారంతో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లోని దేవాలయాల్లో గురు పౌర్ణమి వేడుకలను నిర్వహించారు.

ప్రమాద సూచనలను పోలీసులకు చెప్పండి

సిఐ సాంబశివరావు

ప్రజాశక్తి- వినుకొండ



వినుకొండ పట్టణంలో ఎక్కడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలిస్తే ప్రజలు వెంటనే పోలీసులు దృష్టికి తీసుకువస్తే ప్రమాదం జరగకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటామనిపట్టణ సీఐ సాంబశివరావు తెలిపారు. వినుకొండలో ఇటీవల జరిగిన హత్య నేపథ్యంలో ఆదివారం పట్టణంలోని పెద్ద మసీదు సెంటర్, ముస్లిమ్స్ వీధుల్లో పోలీస్ రూట్ మార్చ్ నిర్వహించారు. ఈ సం దర్భంగా సిఐ సాంబశివ రావు మాట్లాడుతూ గొడవలు జరిగే అవకాశం ఉందని, రెండు నెలలకు మూడు నెలలకు, లేదా సంవత్సరానికైనా ఫలానా వ్యక్తుల మధ్య, సామాజిక వర్గాల మధ్య గొడవలు ప్రమాదం జరిగే పరిస్థితి నెలకొందని తెలిసిన వెంటనే ప్రజలు పోలీసులకు సమాచారం అందిస్తే ప్రాథమిక దశలోనే ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శిరస్త్రాణమే రక్షణ కవచం

రోడ్ సేఫ్టీ ఎన్జీవో ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే అరవింద బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం విధిగా ధరించాలని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. ఈ మేరకు రోడ్డు సేఫ్టీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.కె.దుర్గ పద్మజ రూపొందించిన రోడ్డు భద్రతా అవగాహన వాల్‌పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అరవిందబాబు మాట్లాడుతూ ప్రాణం అత్యంత విలువైందని, రోడ్డు ప్రమాదం జరిగితే కుటుంబం మొత్తం రోడ్డున పడుతుందని అన్నారు. గత కొంత కాలంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న తీరు దిగ్భ్రాంతికి గురి చేస్తోందన్నారు. ప్రజలు రోడ్డు ప్రమాదాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, 'మన భద్రతను మనమే చూసుకోవాలి' అని సూచించారు. ఇలాంటి విషయంలో అవగాహన కల్పించేందుకు ఎన్జీవోలు ముందుకు రావడం సంతోషకరం అన్నారు. ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్,కార్లు నడిపే వారు సీటు బెల్టు ధరించడం తప్పనిసరిగా పాటించినపుడే రక్షణ కలుగుతుందని అన్నారు. మద్యం తాగి, లైసెన్స్ , సరైన వాహన అనుమతులు లేకుండా వాహనాలు నడపొద్దని సూచించారు. రోడ్డు సేఫ్టీ ఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.కె పద్మజ మాట్లాడుతూ ప్రధానంగా యువత తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. శిరస్త్రాణం వినియోగం, దాని ప్రాధాన్యం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీఓ సభ్యులు వెంకటేశ్వరరావు, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.





32వ వార్డులో పర్యటించిన ఎమ్మెల్యే

క్షేత్ర స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడమే లక్ష్యమని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. ఈ మేరకు నరసరావుపేట పట్టణంలోని 32వ వార్డులో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.32వ వార్డులో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని ఫిర్యాదులు రావడంతో క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చినట్లు చెప్పారు. మురుగు నీరు రోడ్ల పై పారుతుండడంతో వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు చెప్పారని అన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వర్షా కాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉన్నందున మురుగు నీటి నిర్వహణలో జాగ్రత్తగా ఉండాలని అధికారులకు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొట్టా కిరణ్, మొహమ్మద్ రఫీ,క్రాంతి,సంజీవ్ రావు, గుత్తా అంకమ్మ చౌదరి తదితరులు ఉన్నారు.

రోటరీ క్లబ్ నూతన భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తా

ప్రజా సేవలో నిత్యం ఉండే రోటరీ క్లబ్ నూతన భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని త్వరలోనే కేటాయిస్తానని ఎమ్మెల్యే అరవింద బాబు హామీ ఇచ్చారు.ఈ మేరకు నరసరావుపేట పట్టణంలోని శ్రీపాద కళ్యాణ మండపంలో రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నరసరావుపేట ప్రజలకు రోటరీ క్లబ్ అందించే సేవలు అభినందనీయమని కొనియాడారు. క్లబ్ నిర్వాహకులకు , సభ్యులకు అభినందనలు తెలిపారు.వ్యాపారాలు చేస్తూ ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలు విరివిగా చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఆయన అభినందించారు.

పెట్టుబడి సాయం హామీని అమలు చేయండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్రంలో ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతులకు ఏటా ఇస్తామన్న రూ 20 వేలు పెట్టుబడి సాయాన్ని త్వరితగతిన అందజేసేందుకు చర్యలు చేపట్టాలని ఎపి రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల ఆయా సంఘాల రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా పల్నాడు జిల్లాలో సిఐటియు అనుబంధ సంఘాలైన రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా గ్రామ సచివాలయాలలో అన్నదాత సుఖీభవ పథకం కౌలు రైతులకు పథకం వర్తింప చేయాలని డిమాండ్ చేస్తూ ప్రచార ర్యాలీ నిర్వహించి వినతి పత్రాలు అందజేశామని పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో కొత్త ప్రభుత్వం వ్యవసాయ పెట్టుబడులు రైతులకు ఇస్తామన్న పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే రైతులకు, కౌలు రైతులకు అందించాలని కోరారు. తెలంగాణ మాదిరి రూ 2 లక్షల వరకు రైతులకు, కౌలు రైతులకు రుణ మాఫీ చేయాలని, కేరళ తరహాలో రైతు విమోచన చట్టం చేయాలని, రైతాంగాన్ని అప్పుల బారి నుండి కాపాడాలన్నారు. వ్యవసాయ మోటార్లుకు మీటర్లు పెట్టే జిఓ నెం.22 ను వెంటనే రద్దు చేయాలని కోరారు. భూయజమాని సంతకంతో నిమిత్తం లేకుండా ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పెట్టుబడి సాయం, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు కౌలు రైతులకు కూడా వర్తింపజేయాన్నారు. ఉపాధి కూలీలకు వెంటనే బకాయి చెల్లించాలని, ఏడాదికి 200 రోజులు పని దినాలు రోజు కూలీ రూ 600 చెల్లించాలని ప్రకటనలో డిమాండ్ చేశారు.

ప్రగల్భాలు పలికే ప్రాంతీయ పార్టీలు

రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం. రాధాకృష్ణ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఎన్నికలకు ముందు ప్రత్యేక తరగతి హోదా సాధన తమ లక్ష్యమని, అందు కోసం ఎటువంటి త్యాగానికైనా సిద్ధ మని ప్రగల్బాలు పలికే ప్రాంతీయ పార్టీలు రెండు ఎన్నికలు పూర్తయిన త ర్వాత కుంటి సాకులు చెబుతూ రెం డు నాలుకల ధోరణి అవలంబిస్తున్నాయని రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, చిలకలూరిపేట నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఎం.రాధాకృష్ణ విమర్శించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంటరీ పార్టీల సమావేశాలలో ప్రత్యేక తరగతి హోదా గురించి ఈ రెండు పార్టీలు కూడా ఒక్క మాట కూడా మాట్లాడక పోవడం ఆయా పార్టీల విధానాలను ప్రతిబింబిస్తున్నా యని విమర్శించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సమస్యల పరిష్కారం, ప్రత్యేక హోదా సాధన.. ఈ రెండు పార్టీల నేతృత్వంలో అందని ద్రాక్షేనని విమర్శించారు. మూడు ప్రాంతీయ పార్టీలకు ప్రత్యామ్నాయం షర్మిల నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అన్నారు.

మీడియాకు విజయసాయిరెడ్డి బహిరంగ క్షమాపణలు చెప్పాలి

తెలుగు యువత నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి శ్రీనివాస రెడ్డి



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వైసిపి రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డిపై జర్నలిస్టులు, మీడియాతో పాటు టిడిపి నేతలు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ శాంతి భర్త మదన్ మోహన్ విలేకరుల సమావేశంలో విజయసాయిరెడ్డిపై చేసిన ఆరోపణలు మాత్రమే ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రసారం చేసిందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని తెలుగు యువత నరసరావుపేట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మీడియాపై విజయసాయి రెడ్డి చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారిన నేపథ్యంలో స్పందించిన శ్రీనివాస రెడ్డి ఆదివారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలకరుల సమావేశంలో మాట్లాడుతూ గిరిజన మహిళ అధికారిణి శాంతి జీవితం నాశనం చేశారన్నారు. గత 5 ఏళ్లు మీడియా గొంతు నొక్కారని బ్లూ మీడియా ఛానళ్ళు మాత్రమే ప్రసారమయ్యేలా చేసిన విజయసాయి రెడ్డికి మీడియా గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రముఖ మీడియా చానల్స్ పై ఆయన అవివేకంతో చేసిన ఆరోపణలు పూర్తిగా అర్థరహితమని, ఆయన క్షమాపణ చెప్పాలని లేని పక్షంలో తెలుగు యువత ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. రాష్ట్ర హోంమంత్రి అనితకి శాంతి భర్త ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి విజయసాయిరెడ్డిని చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

చిరువ్యాపారులకు వాన దెబ్బ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

గత ఐదు రోజులుగా తుఫాన్ ప్రభావంతో ఒక మోస్తర వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. దీంతో చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు తమ సరుకులు కొనేవారు లేక వ్యాపారాలు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. భవన ని ర్మాణ కార్మికులు,రోజు వారీ కూలీ పనులు చేసుకునే వారికి పనులు లేవు. పట్టణంలోని అన్ని సెంటర్లు కలుపుకుని నెట్టుడు బండ్ల కార్డులు కలిగిన వారి సంఖ్య సుమారు 350 నుంచి 380 వరకు ఉంటారు. ఎటువంటి గుర్తింపు కార్డులు లేని వారి సంఖ్య 700 మంది ఉన్నారు. ఇవి కాక టిఫిన్ బండ్లు, బార్ల, ప్రధాన సెంటర్లలో చికెన్ బండ్లు, ఇతర చిరు వ్యాపారాలు చేసుకునే వారు వున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి అన్ని రంగాల్లో కూలి పనులు చేసుకునే గుర్తింపు కార్డులు కలిగిన వారికి 10 కేజీల బియ్యం, ఒక కేజీ నూనె, ఒక కేజీ కంది పప్పు, నెలకు సరిపడా చిల్లర సరుకులు ఇప్పించాలని వారు కోరుతున్నారు.



వర్షం తర్వాత కొనుగోలుదారుల కోసంఎదురు చూస్తున్న వ్యాపారులు

ఆవులకు విశ్రాంతి తీసుకునే అడ్డాలుగా రోడ్లు

ట్రాఫిక్ చిక్కులతో వాహనదార్లకు అసౌకర్యం - పలువురికి ప్రమాదాలు



ప్రజాశక్తి-మంగళగిరి

రాత్రివేళ రోడ్డుపై అడ్డమేమీ లేదని ధీమాగా వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు ఒక్కసారిగా షడన్ బ్రేక్ బేయాల్సి వచ్చింది. దీంతో వాహనం అదుపు తప్పడం, బండిపైన ఉన్నవారు గాయాలతో ఆస్పత్రి పాలవడం జరిగిపోయాయి..

పగటి వేళ ఏదో పని మీద హడావుడిగా వాహనాలపై వెళ్లేవారు ఉన్నట్టుండి వాహన వేగాన్ని తగ్గించి దిశ మార్చుకోవాలి. ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా లేదా? ఏమీ కాదులే అని వాటి పక్కగా వెళ్లినా గాయాల పాలు కాకతప్పదు. కొన్ని సందర్భాల్లో సగం రోడ్డును వదిలేసి వాహన రాకపోకలు సాగించాల్సిందే..

ఇదీ మంగళగిరిలో తరచూ తలెత్తుతున్న ఇబ్బందులు.. పశువుల పాకల్లోనో, పశ్చికబయళ్లలోనో ఉండాల్సిన ఆవులు నడిరోడ్డుపై సంచరిస్తూ వాహనాలకు అంతరాయం కలిగిస్తున్నాయి. మొత్తంగా పట్టణంలోని రోడ్లు ఆవులకు విశ్రాంతి అడ్డాలుగా మారాయి. గుంపులు గుంపులుగా రోడ్లపై తిరుగుతూ ఎక్కడంటే అక్కడే తిష్ట వేస్తుండడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఒక్కొక్కసారి రోడ్డుపై నడిచే పాదచారులు కూడా భయపడుతూ ఆవులకు దూరంగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రత్యేకించి రాత్రి వేళలో రోడ్డుకు మధ్యలో ఆవులు విశ్రాంతి తీసుకుంటూ ఉంటున్న సమయంలో కొందరు వాహనదారులు వేగంగా వస్తు రోడ్డుకు అడ్డంగా ఉన్న ఆవులను దగ్గరికి వచ్చే వరకు గమనించలే పమాదాలు బారిన పడుతున్నారు.

ప్రత్యేకించి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద, కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, మిద్దె సెంటర్, పాత కూరగాయల మార్కెట్ వద్ద, వడ్లపూడి సెంటర్ తదితర ప్రాంతాల్లో ఆవులు సంచారం ఎక్కువగా ఉంది. ఇప్పటికే పట్టణంలో పలు ప్రాంతాల్లో ఆవులు వలన పడి ప్రమాదాల గురై ఆస్పత్రి పాలైనవారుండగా కొందరు మరణించారు కూడా. ఈ ఘటనలను దృష్టిలో పెట్టుకొని ఆవుల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని ఈనెల మొదటి వారంలో మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ ప్రత్యేకించి వాటి యజమానులకు నోటీసులిచ్చారు. ఎవరికి వారే వారి ఆవులను రోడ్లపైకి పంపించవద్దని, అలా పంపిన ఆవులను గోశాల కేంద్రాలకు తరలిస్తామని హెచ్చరిస్తూ వారితో సమావేశమూ నిర్వహించారు. అయినా పరిస్థితిలో మార్పు లేదు. వీరిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ అధికారులు హెచ్చరించినా యథాతథంగానే వదిలేస్తున్నారు. నగరపాలక సంస్థ అధికారులతోపాటు పోలీసులూ ఈ విషయంలో చొరవ తీసుకోవాలని, ఆవులు రోడ్లపైకి రాకుండా చూడాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్ : మండలంలోని చిన్నకాకానిలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) కమిటీ సమావేశం కాజా శివశంకర్‌రావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా వల్రం పూర్ణయ్య, అధ్యక్షులుగా మల్లవరపు అంబేద్కర్, కార్యదర్శిగా బుల్లా నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా గండికోట శ్రీదేవి, గండికోట సాంబయ్య, నంగనం వెంకట్రావు, సహాయ కార్యదర్శులుగా కె.శ్రీను, మల్లవరపు, శివలక్ష్మి, కోశాధికారిగా బి.రమేష్ ఎన్నికయ్యారు. సిఐటియు మండల కార్యదర్శి వి.దుర్గారావు, అధ్యక్షులు శివపార్వతి, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం మండల కార్యదర్శులు కోటేశ్వరమ్మ, జి.బాబూవరప్రసాద్, కె.సాంబశివరావు మాట్లాడారు.

దుగ్గిరాల ఎస్ఐగా వెంకటరవి



ప్రజాశక్తి - దుగ్గిరాల : దుగ్గిరాల నూతన ఎస్ఐగా ఎస్.వెంకటరవి ఆదివారం విధులు చేపట్టారు. ఈయన గతంలో బాపట్ల జిల్లా అడవులదీవి నుండి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన బి.బ్రహ్మయ్య ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు.

డిస్కౌంట్‌తో మెడికల్ షాపుల మనుగడ అసాధ్యం



మాట్లాడుతున్న రంగారావు

ప్రజాశక్తి-గుంటూరు

వినియోగదారునికి 22 శాతం డిస్కౌంట్ ఇస్తూ కేవలం 5 నుండి 6 శాతం లాభాలు హోల్‌సేల్, రిటైలర్స్ పంచుకోవడం ద్వారా మెడికల్ షాపుల మనుగడకు తీవ్ర విఘాతం ఏర్పడుతున్నదని రాష్ట్ర కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కెపి రంగారావు అన్నారు. అప్పులు, వడ్డీలు చెల్లించలేక షాపులను మూసివేసి ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి ఏర్పడటం బాధాకరమన్నారు. ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ పిలుపుమేరకు హోల్ సేల్, రిటైల్ మెడికల్ షాపులు తక్షణం డిస్కౌంట్ బోర్డులు ఎవరికివారు తొలగించుకోవాలని రంగారావు అన్నారు. ఆల్ ఇండియా కెమిస్ట్రీస్ అసోసియేషన్ గుంటూరు జిల్లా నూతన తొలి జనరల్ బాడీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం స్థానిక లక్ష్మీపురం కాటన్ అసోసియేషన్ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షులు జిఎన్ఎస్ ఆదినారాయణ మాట్లాడుతూ తమ మనుగడ, ఉనికి కోసం మండల, పట్టణ స్థాయిల్లో ఉండే రిటైల్ మెడికల్ షాపుల వారు సంఘటితంగా, స్వచ్ఛందంగా డిస్కౌంట్ బోర్డులను తొలగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కార్యదర్శి కె.చంద్రశేఖరరావు నివేదిక సమర్పించగా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్.సుబ్బారావు, కోశాధికారి టీవీ సుబ్రహ్మణ్యం, సీనియర్ సభ్యులు బివి.ప్రసాదరావు, కె.శివశంకరరావు, రిటైలర్స్ అసోసియేషన్ కార్యదర్శి టీవీ సాయిరాం పాల్గొన్నారు.

50 మందికి కళ్లజోళ్లు పంపిణీ



ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక రామనాథం చినకోటయ్య శివపార్వతమ్మ వృద్ధుల సేవాశ్రమంలో ఆశ్రమ అధ్యక్షులు రామనాథం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం 110వ నేత్ర పరీక్ష శిబిరం జరిగింది. ఈనెల 14వ తేదీన పరీక్షలు చేయించుకున్న వారిలో 50 మందికి కళ్లజోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పి.శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ రామారావు, ఎ.రాధిక పాల్గొన్నారు.

కవిత్వానికి మంచి బిగింపు అవసరం



కాశయ్యను సత్కరిస్తున్న రావి రంగారావు తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

కవిత్వానికి మంచి బిగింపు అవసరమని ప్రముఖ సాహితీ విశ్లేషకులు డాక్టర్ రావి రంగారావు అన్నారు. గుంటూరులో అమరావతి సాహితీ మిత్రులు ఆదివారం ఉదయం సర్వీస్ హెల్త్‌ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో నిర్వహించిన సభలో ఆయన అధ్యక్షత వహించి ప్రసంగిస్తూ కవిత్వం ప్రజలకు చేరాలంటే కవిత్వానికి మంచి బిగింపు అవసరం అని చెప్పారు. సరళమైన వాక్యనిర్మాణం ఉండాలన్నారు. అవసరం లేని పదాలు, పాదాలు కవిత్వానికి బరువని చెప్పారు. ధ్వని, వ్యంగ్యం, చమత్కారం, సరికొత్త వర్ణనలతో జనరంజకంగా కవిత్వం ఉండాలన్నారు. 'మినీ కవిత 2006' మినీ కవితల సంకలనం గురించి వి.వి.రావు ప్రసంగిస్తూ గ్రంథంలోని మినీ కవితలను ఉదాహరించి విశ్లేషించారు. 'ఈ మాసం కవి' గా కంచర్ల కాశయ్య (మంగళగిరి) పాల్గొని అమరావతి రైతుల ఉద్యమం గురించి పాటలు వినిపించి సభను అలరింపచేశారు. పింగళి భాగ్యలక్ష్మి నిర్వహించిన కవి సమ్మేళనంలో చల్లా సత్యవతి, దినవహి సత్యవతి, పూసపాటి కృష్ణ సూర్య కుమార్, డాక్టర్ సూర్యదేవర రవికుమార్, యర్రగుంట్ల పాణిరావు, శరకణం కనకదుర్గ, మన్నం వెంకటగురువు, గోలిమధు, ఈవూరి వెంకటరెడ్డి, మస్తాన్‌బాబు, రాయపురెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. సంస్థ తరపున డాక్టర్ టి.సేవాకుమార్ తదితరులు ఈమాసం కవి కాశయ్యను, 'నిక్కచ్చి' కవిత బహుమతి పొందిన గోలి హనుమచ్చాస్త్రిని, హైదరాబాద్ నుంచి పాల్గొన్న సత్యనారాయణను సత్కరించారు. తొలుత ఇ.చంద్రయ్య సుభాషితం సభను ఆకట్టుకుంది.



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు

ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌కు బీసీ సంక్షేమ సంఘం సత్కారం

ప్రజాశక్తి - మంగళగిరి

గుంటూరు తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్‌ను స్థానిక బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో సంఘం నాయకులు ఆదివారం ఘనంగా సత్కరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన్న శంకరరావు మాట్లాడుతూ నసీర్ అహ్మద్‌ను ఎమ్మెల్యేగా గెలిపించడానికి బీసీ, ఎస్టీ, ఎస్సీ మైనార్టీ నాయకులు కృషి చేశారని అన్నారు. వారి అభ్యున్నతి కోసం ఎమ్మెల్యే కృషి చేయాలని కోరారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి కె.క్రాంతికుమార్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షులు పి.మహేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.నాగమల్లేశ్వరరావు, టి,హనుమంతరావు, జి.శ్రీనివాసరావు, మహమ్మద్ ఖాన్, కె.శివరాం, బాబాజీ పాల్గొన్నారు.



రహదారికి తాత్కాలిక మరమ్మతులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

వర్షాల నేపథ్యంలో రహదారులు బురదమయంగా మారి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్నాయి. తెనాలి - విజయవాడ ప్రధాన రహదారి నుండి దుగ్గిరాల శివాలయం సెంటర్ వరకు ఉన్న రహదారి చిత్తడిగా మారి ద్విచక్ర వాహన చోదకులు పలువురు బురదలో పడిపోయారు. దీంతో తక్షణ చర్యలకు టిడిపి నాయకులు ఉపక్రమించారు. ఆదివారం చిప్స్ తోలించి జారకుండా పనులు చేయించారు. వి.నరసింహారావు, వి.సుధాకర్, డి.చంటి, పి.వర్ధన్, సాదిక్‌బాషా, సిహెచ్.రాము, జి.శశివర్ధన్, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

గండాలయ్యపేట ఎస్టీ కాలనీ పేద ప్రజలకు భోజన పాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

నాలుగు రోజుల నుంచి వర్షాల కారణంగా స్థానిక గండాలయ్యపేటలోని ఎస్టీ కాలనీ వాసులు తమ జీవనోపాధి కోల్పోయారు. ఈ విషయాన్ని స్థానిక టిడిపి నాయకులు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లగా ఆహారం ఏర్పాటు చేశారు. దీంతో శనివారం రాత్రి 200 మందికి భోజనం ప్యాకెట్‌లను టిడిపి నాయకులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జి.దుర్గారావు, ఎస్.శివరామకృష్ణ, బి.వాసు, వి.మాధవరావు, జె.బాలకృష్ణ, ఎస్.గంగాధరరావు, పి.గంగ, పి.నాగరాజు, డి.సూరిబాబు పాల్గొన్నారు.





పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ నాయకులు

27న స్టూడెంట్‌, యూత్‌ ఫెస్ట్‌

ప్రజాశక్తి - చిలకలూరిపేట

భారత విద్యార్థి ఫెడరేషన్‌ (ఎస్‌ఎఫ్‌ఐ), భారత ప్రజాతంత్ర యువజన సంఘం (డివైఎఫ్‌ఐ), ఆధ్వర్యంలో ఈనెల 27న యూత్‌, స్టూడెంట్‌ ఫెస్ట్‌ నిర్వహిస్తామని ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ పల్నాడు జిల్లా కార్యదర్శులు కె.సాయికుమార్‌, ఆంజనేయరాజు తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు, యువతను సాంస్కృతిక రంగంలో ప్రోత్సహించేందుకు, వారిలో సమిష్టి తత్వం, దేశభక్తిని పెంపొందించేందుకు, శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడానికి, పర్యావరణంపై అవగాహన కల్పించడానికి ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలోని ఎన్‌ఆర్‌టి సెంటర్‌ వద్దగల గ్రాండ్‌ వెంకటేష్‌ ఫంక్షన్‌ హాలులో నిర్వహించే ఈ ఫెస్ట్‌లో సింగింగ్‌, క్లాసికల్‌ డ్యాన్స్‌, ఫోక్‌ డ్యాన్స్‌, ఫ్యాన్సీ డ్రెస్‌ పోటీలు, ఏకపాత్రాభినం, మార్షల్‌ ఆర్ట్స్‌ విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. ప్రతివిభాగంలో 16 ఏళ్లలోపు వారు లేదా పదో తరగతి లోపువారిని జూనియర్స్‌గా, 16 ఏళ్ళు దాటిన వారిని సీనియర్స్‌గా పోటీలు నిర్వహిస్తామని, మొదటి రెండు స్థానాల్లో నిలిచిన వారిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావుతోపాటు ఎమ్మెల్సీలు కెఎస్‌ లక్ష్మణరావు, మర్రి రాజశేఖర్‌ హాజరవుతారని, విద్యార్థులు, యువత భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గణేష్‌, ప్రణీత్‌ పాల్గొన్నారు.

ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే పైర్ల మునక

- గుంటూరు ఛానల్‌లో గుర్రపు డెక్కను సత్వరమే తొలగించాలి
- నీట మునిగిన పొలాలను పరిశీలించిన సిపిఎం



ప్రజాశక్తి - పెదకాకాని

మండలంలోని గోళ్లమూడి, ఉప్పలపాడు, తక్కెళ్లపాడులో వర్షాలకు ముంపుబారిన పడిన పొలాలను సిపిఎం నాయకులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజి మాట్లాడుతూ మూడ్రోజులుగా ఎడతెరిపి లేని వానలతో పైర్లు దెబ్బతింటున్నాయని చెప్పారు. వెదపద్ధతిలో నాటి వరి మొలక దశలో ఉండగా పల్లపు ప్రాంతాల్లోని పొలాల్లో నీరు నిలిచి మొక్క ఉరకెత్తడం, తర్వాత చనిపోయే పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఈ పొలాలను అధికారులు సత్వరమే పరిశీలించి నష్టపరిహారం ఇవ్వాలని, మరోసారి సాగు చేసేందుకు నాణ్యమైన విత్తనాలతోపాటు ఎరువులు, పురుగు మందులు అందించాలని డిమాండ్‌ చేశారు. గుంటూరు ఛానల్‌ పూర్తిగా గుర్రపు డెక్కతో మూసుకు పోయిందని, దీనివల్ల నీటి పారుదల లేక పొలాల్లోని నీరు బయటకు పంపడానికి రైతులు నానా అవస్థ పడుతున్నారని చెప్పారు. పంట కాల్వల వ్యవస్థను పాలకులు కొన్నేళ్లుగా తీవ్ర నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. అనేక గ్రామాలకు తాగు, సాగు నీరందించే గుంటూరు ఛానల్‌లో వ్యర్థాలను తొలగించకపోవడం, పూడిక తీయకపోవడం దారుణమన్నారు. అనేక గ్రామాల మురుగు నీరు ఇదే కాల్వలోకి చేరి నీరు మొత్తం కలుషితమవుతోందని, ఇది వ్యవసాయంతోపాటు, ఈ ఈ కాల్వ నీటిని తాగే ప్రజల ఆరోగ్యాన్నీ దెబ్బతీస్తోందని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గుర్రపు డెక్కను తొలగింపజేయాలని, కాల్వకు ఉన్న లాకులను మరమ్మతులు చేయించాలని కోరారు. పరిశీలనలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్‌.శివాజి, నాయకులు జి.రాజారమేష్‌ పాల్గొన్నారు.

రచయితల సంఘం అధ్యక్షులుగా భవానిదేవి



ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక అరండల్‌పేటలో జిల్లా కేంద్ర గ్రంథాలయంలోని సమావేశ మందిరంలో ఆదివారం గుంటూరు జిల్లా రచయతల సంఘం అత్యవసర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రముఖ రచయిత్రి డాక్టర్‌ సి.భవానీదేవి గుంటూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. సోమేపల్లి వెంకట సుబ్బయ్య మరణానంతరం ఖాళీగా ఉన్న అధ్యక్ష స్థానానికి ఎన్నిక ప్రక్రియలో మెజారిటీ సభ్యుల ఆమోదంతో భవానీదేవిని ఎన్నుకున్నట్లు సంఘ ఉపాధ్యక్షులు బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్‌.ఎం.సుభాని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో గుంటూరు జిల్లా రచయితల సంఘానికున్న స్థానాన్ని నిలుపుకునేలా రాష్ట్ర, జిల్లా స్థాయిలో పలు కార్యక్రమాలు నిర్వహించి సాహిత్య రంగంలో కృషి చేస్తామని వారు తెలిపారు. తొలుత ఈనెల19న మరణించిన ప్రముఖ కవి అడిగోపుల వెంకటరత్నం మతికి సంతాపం తెలుపుతూ మౌనం పాటించారు. కార్యక్రమంలో కె.జె.రమేష్‌, కోశాధికారి నానా, సహాయ కార్యదర్శి ఈవూరి వెంకటరెడ్డి, సభ్యులు కొణతం నాగేశ్వరరావు, డాక్టర్‌ టి.గోవిందయ్య, టి.పద్మావతి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ సరఫరాకు చర్యలు

- దరఖాస్తు చేసిన నెలలోగా వ్యవసాయ కనెక్షన్‌
- ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు రూ.454 కోట్లు
- ప్రజాశక్తితో సిపిడిసిఎల్‌ పల్నాడు జిల్లా ఈఈ శ్రీనివాసరావు

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్టు విద్యుత్‌ శాఖ (సిపిడిసిఎల్‌) పల్నాడు జిల్లా ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీరు ఎస్‌.శ్రీనివాసరావు చెప్పారు. విద్యుత్‌ వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించి అదనపు ఛార్జీల భారం నుండి బయట పడాలన్నారు. విద్యుత్‌ చౌర్యం నేరమన్నారు. ప్రమాదాల భారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.





ఓల్టేజి సమస్య పరిష్కారానికి చర్యలు?

ఓల్టేజ్‌ సమస్యలపై ఏమైనా ఫిర్యాదులు అందితే తక్షణమే ట్రాన్స్ఫార్మర్‌ మార్చేసి సమస్యను పరిష్కరిస్తున్నాం. ఏ గ్రామంలోనైనా అటువంటి సమస్య ఉంటే తమ సిబ్బంది ద్వారా సమస్య పరిష్కారం చేసుకోవచ్చు.

విద్యుత్‌ చౌర్యం అరికట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలు?

తరచూ విజిలెన్స్‌ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. జిల్లాకు సంబంధించిన విద్యుత్‌ శాఖ సిబ్బంది సైతం ప్రతినెలా ఒక మండలంలో పర్యటిస్తూ విద్యుత్‌ చౌర్యంపై జరిమానాలు వేస్తున్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇటీవల వినుకొండ పట్టణంలో చేసిన తనిఖీలు 329 మీది కేసులు నమోదు చేసి రూ.9.45 లక్షలు జరిమానా విధించాం.

విద్యుత్తు స్తంభాల మార్పులు?

శిథిలావస్థకు చేరిన స్తంభాలు ఉన్నట్లు సిబ్బంది దృష్టికి తెచ్చినా, ఫిర్యాదులు వచ్చినా అటువంటి ప్రాంతాల్లో వాటిని తొలగించి కొత్తవి ఏర్పాటు చేస్తున్నాం. ఇటీవల కాలంలో 8 వేల కొత్త స్తంభాలు ఏర్పాటు చేశాం. లూజుగా ఉన్న వైర్లు సరిచేశాం.

ఎస్సీ, ఎస్టీలకు ఇస్తున్న రాయితీలు?

ఎస్సీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ పథకం మినహా ఎటువంటి రాయితీలు లేవు. పల్నాడు జిల్లాలో 67211 ఎస్సీ కుటుంబాలకు, 22225 ఎస్టీ కుటుంబాలకు విద్యుత్‌ కనెక్షన్లు ఉన్నాయి. వారికి 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్‌ పథకం కొనసాగుతోంది. 200 యూనిట్ల కంటే వినియోగం పెరిగితే మొత్తం బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. కొంత మంది అవగాహన లేక మొత్తం ఉచితం అనుకుని బిల్లులు చెల్లించడం లేదు. 200 యూనిట్లు దాటి వినియోగించుకుంటే మొత్తం యూనిట్లకు బిల్లు చెల్లించాల్సిందే. ఇందుకు సంబంధించి 2023 ఏప్రిల్‌ నుండి ఈ ఏడాది జూన్‌ వరకు 49.21 కోట్ల విద్యుత్‌ బకాయిలున్నాయి.

వ్యవసాయ విద్యుత్‌ కనెక్షన్లు ఎన్ని ఉన్నాయి?

పల్నాడు జిల్లాలో 96901 కనెక్షన్ల వ్యవసాయ మోటార్లకు విద్యుత్‌ సరఫరా అవుతోంది. రోజుకు 9 గంటల నిర్దేశించిన సమయానికి సరఫరా ఇస్తున్నాం. గత ఆర్థిక సంవత్సరంలో రూ.95.05 కోట్లతో 5003 నూతన వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేశాం. ఈ ఏడాది జూన్‌ వరకు రూ.17.16 కోట్లతో 903 కనెక్షన్లు మంజూరు చేశాం.

వ్యవసాయ విద్యుత్‌ కనెక్షన్లలో అవినీతి గురించి?

వ్యవసాయ విద్యుత్‌ కనెక్షన్‌ కోసం ఒక ట్రాన్స్ఫార్మర్‌ ఏర్పాటుకు కనీసం నలుగురు రైతులు దరఖాస్తు చేసుకోవాలి. ఒక్కో రైతు రూ.6225 డిడి రూపంలో ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కో రైతుకు 3 స్తంభాలు దానికి సరిపడా విద్యుత్‌ తీగ అందిస్తాం. దరఖాస్తు చేసుకుంటే నెల రోజుల్లోగా కనెక్షన్లు ఇస్తాం. ఇప్పటికే కనెక్షన్లు ఉన్న ప్రాంతంలో అయితే దరఖాస్తు చేసుకున్న ఒకటి రెండ్రోజుల్లో కనెక్షన్‌ మంజూరు చేస్తాం. అదనంగా సిబ్బంది డబ్బులు డిమాండ్‌ చేస్తే చర్యలు తీసుకుంటాం. నగదు బదిలీ పథకం ద్వారా ఉచిత విద్యుత్‌ పథకం కొనసాగుతుంది.

ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు?

ఎల్‌టి ఏరియర్స్‌కు సంబంధించి రూ.220.30 కోట్లు, హెచ్‌టి ఏరియర్స్‌ ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలకు కలిపి రూ.233.80 కోట్లు మొత్తం కలిపి రూ.454 కోట్లు బకాయిలున్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లో సరఫరా లేదని విమర్శలున్నాయి కదా?

మారుమూల గ్రామాల ప్రజలకు ఎటువంటి అంతరాయమూ లేకుండా చూస్తున్నాం. 5 వేలు జనాభా దాటిన 24 గ్రామాలకు అటవీ పరిసర గ్రామాలైన బొల్లాపల్లి, మాచర్ల మండలాలలో 47, గురజాల నియోజకవర్గంలో 25, వినుకొండ మండలంలో 8 గ్రామాలకు 3 ఫేజ్‌ విద్యుత్‌ 24 గంటలు సరఫరా ఇస్తున్నాం.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



మెదడు ఆరోగ్యం కోసం నడక

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరులో మూడ్రోజులపాటు నిర్వహించిన ఎపి న్యూరోకాన్‌ వార్షిక సమావేశం ముగింపు సందర్భంగా ఆదివారం గుంటూరులో అందరికీ మెదడు ఆరోగ్యం అనే నినాదంతో బ్రెయిన్‌వాక్‌ నిర్వహించారు. ఈ వాక్‌ను ఆంధ్రప్రదేశ్‌ హైకోర్ట్‌ న్యాయమూర్తి జస్టిస్‌ జి.రామకృష్ణ ప్రారంభించారు స్థానిక ఐటిసి హోటల్‌ నుండి గుజ్జనగుండ్ల వాకింగ్‌ట్రాక్‌ వరకూ ఈ ర్యాలీ సాగింది. మెదడు ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివిధ రకాల బ్యానర్లు, ప్లకార్డులు చూపుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. మెదడు ఆర్యోంగా ఉండటానికి సమతుల ఆహారం తినాలి అని, ప్రతిరోజూ కనీసం 30 నిముషాలు వ్యాయామం చేయాలని, ప్రశాంతమైన నిద్ర అవసరం అని, ధూమపానం మానేయాలని, ఒత్తిడి తగ్గించుకోవాలని పలువురు న్యూరాజిస్టులు తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్‌ ప్రముఖ న్యూరాలజిస్టులు డాక్టర్‌ సుభాష్‌కౌల్‌, డాక్టర్‌ సంజిత్‌ అరోన్‌, డాక్టర్‌ రమాతారక్‌నాథ్‌, డాక్టర్‌ విజయ, రాష్ట్రంలోని వివిధ మెడికల్‌ కాలేజీల నుండి విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎఎన్‌యు ఇన్‌చార్జి వీసీకి మలినేని అధ్యాపకుల శుభాకాంక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ ఇన్‌ఛార్జి వీసీగా బాధ్యతలు స్వీకరించిన కంచర్ల గంగాధర్‌ను మలినేని లక్ష్మయ్య ఉమెన్స్‌ ఇంజినీరింగ్‌ కాలేజి అధ్యాపక బృందం కలిసి శుభాకాంక్షలు తెలిపింది. కార్యక్రమంలో అధ్యాపకులు పోపు రమేష్‌బాబు, దరువు రవికిరణ్‌, గోనగుంట్ల రామస్వామి, హరికృష్ణ పాల్గొన్నారు.

